RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 15 అక్టోబర్ 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:118



# ప్రజాబలం

15 అక్టోంబర్ 2026 గురువారం


## భారత్‌లో స్టార్‌లింక్ వివాదం

భారత్‌లో స్టార్‌లింక్ ఎంట్రీపై ఎలాన్ మస్క్ వ్యాఖ్యల కలకలం రేపుతున్నాయి. అంబానీపై విమర్శలు స్పెక్ట్రమ్ కేటాయింపులు, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి స్పందనలతో వివాదం ప్రారంభమయింది. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్, భారత పారిశ్రామిక దిగ్గజం ముఖేష్ అంబానీల మధ్య నడుస్తున్న వాణిజ్య పోరు సరికొత్త రాజకీయ, సామాజిక రచ్చకు దారితీసింది. భారత ప్రజలపై తమ ఏకఛత్రాధిపత్యాన్ని కాపాడుకోవడానికి కొందరు ఒలిగార్క్‌లు స్టార్‌లింక్‌ను అడ్డుకుంటున్నారు.. భారత్‌కు నిజమైన బాస్ అంబానీయేనా? అంటూ ఎలాన్ మస్క్ ఎక్స్ వేదికగా విరుచుకుపడటంతో ఈ అంశం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అయితే, ఈ ఆరోపణలు కేవలం ఒక వ్యాపార పోటీకి ప్రతిరూపమా లేక దేశీయ నియంత్రణలు, భద్రతా ప్రమాణాలకు సంబంధించిన అంశమా అన్నది లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. స్టార్‌లింక్ అనేది ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ రూపొందించిన లో-ఎర్త్ ఆర్బిట్ ఉపగ్రహ నెట్‌వర్క్. సాంప్రదాయ ఫైబర్ లేదా సెల్ టవర్ల అవసరం లేకుండా, అంతరిక్షంలో ఉన్న వేలాది చిన్న ఉపగ్రహాల ద్వారా నేరుగా భూమిపై ఉన్న డిష్, రిసీవర్లకు హై-స్పీడ్ శాటిలైట్ ఇంటర్నెట్‌ను ఇది అందిస్తుంది. భౌగోళికంగా చేరుకోలేని కొండ ప్రాంతాలు, అడవులు , మారుమూల గ్రామాలకు ఇది ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పిస్తుంది. భారత్‌లో ప్రవేశించేందుకు స్టార్‌లింక్ గత ఐదేళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, వ్యాపార నిబంధనలు , స్పెక్ట్రమ్ కేటాయింపు పద్ధతులపై దేశీయ టెలికాం కంపెనీలైన రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌తో ప్రధాన విభేదాలు తలెత్తాయి. అసలు వివాదానికి ప్రధాన మూలం స్పెక్ట్రమ్ కేటాయింపు విధానం . అంతర్జాతీయ నిబంధనల ప్రకారం శాటిలైట్ స్పెక్ట్రమ్‌ను వేలం వేయకుండా పరిపాలనా ప్రాతిపదికన కేటాయించాలని మస్క్ వాదిస్తుండగా, దేశీయ స్పెక్ట్రమ్‌ను వేలం ద్వారా మాత్రమే కేటాయించాలని, అప్పుడే లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ ఉంటుందని అంబానీ నేతృత్వంలోని జియో పట్టుబట్టింది. దీనికితోడు జాతీయ భద్రత, డేటా లోకలైజేషన్ అంశాలు ప్రధాన అవరోధాలుగా మారాయి. భారతీయుల డేటా దేశీయ సర్వర్లలోనే భద్రంగా ఉండాలని, భద్రతా ఏజెన్సీలు నిఘా పెట్టేలా శాటిలైట్ గేట్‌వేలను ఏర్పాటు చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. మస్క్ ఆరోపణలను కేంద్ర నివేదికలు తీవ్రంగా ఖండించాయి. టెలికాం నియంత్రణలన్నీ పారదర్శకంగా, వివక్ష రహితంగా ఉన్నాయని, స్టార్‌లింక్‌తో పాటు ఇతర మూడు సంస్థలు కూడా ఒకే భద్రతా తనిఖీల దశలో ఉన్నాయని కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ వ్యాపార పోరు కాస్త రాజకీయ రంగు పులుముకుంది. మస్క్ వ్యాఖ్యలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ.. వెల్‌కమ్ టూ ఇండియా ఎలాన్.. అసలు వ్యక్తి ఎవరో తెలిసే వరకు వేచి చూడండి అని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. దీనికి మస్క్ థాంక్యూ రాహుల్, ఇది నిజంగా ఆందోళనకరం అని బదులిచ్చారు. ఇక తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఈ వివాదంపై స్పందిస్తూ, వినూత్న శాటిలైట్ ఇంటర్నెట్ సాంకేతికతను భారత్ ఆహ్వానించాలని, కొందరి పారిశ్రామిక ప్రయోజనాల కోసం అంతర్జాతీయంగా బ్రాండ్ ఇండియా ను బలహీనపరచకూడదని పేర్కొన్నారు. కాంగ్రెస్ శ్రేణులు దీనిని కేంద్ర ప్రభుత్వం, కార్పొరేట్ దిగ్గజాల బంధానికి నిదర్శనంగా విమర్శించగా, బిఆర్ఎస్, బిజెపి వర్గాలు భద్రతా నియంత్రణలను పక్కనబెట్టి విదేశీ సంస్థలకు కార్పెట్ పరిచే ప్రసక్తే లేదని స్పష్టం చేశాయి. ఈ మొత్తం వివాదంపై ముఖేష్ అంబానీ, రిలయన్స్ జియో వర్గాలు ఇప్పటివరకు ప్రత్యక్షంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. అయితే, జియో కూడా స్వయంగా అంతరిక్ష ఉపగ్రహ ఇంటర్నెట్ నెట్‌వర్క్‌ను సొంతంగా అభివృద్ధి చేసేందుకు బిలియన్ డాలర్ల ప్రణాళికలతో సిద్ధమవుతోంది. కాబట్టి, విదేశీ దిగ్గజమైన స్టార్‌లింక్ భారత్‌లోకి ముందే అడుగుపెడితే దేశీయ టెలికాం పరిశ్రమకు, ముఖ్యంగా 5ఉ వ్యాపారానికి గట్టి పోటీ ఎదురవుతుందనేది బహిరంగ రహస్యమే. నిబంధనలు తీరి స్టార్‌లింక్ భారత మార్కెట్లోకి వస్తే మారుమూల ప్రాంతాల్లో నెట్‌వర్క్ విప్లవం రావడం ఖాయం. అయితే డివైజ్ ధరలు, ప్లాన్ చార్జీలు సామాన్యుడికి అందుబాటులో ఉంటాయా లేదా అన్నది ప్రశ్నార్థకమే. ఎలాన్ మస్క్ చేసిన ఆరోపణలు కేవలం ఏకపక్ష వ్యాపార కోపంతో కూడుకున్నవా లేక విదేశీ పెట్టుబడులకు భారత నిబంధనలు కఠినంగా మారుతున్నాయా అనే దానిపై విస్తృత విశ్లేషణలు నడుస్తున్నాయి. జాతీయ భద్రత , డేటా రక్షణ విషయంలో రాజీ పడకుండానే, దేశీయ , అంతర్జాతీయ సంస్థలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా భారత టెలికాం రంగాన్ని ఆరోగ్యకరమైన పోటీ వైపు నడిపించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్న అభిప్రాయం ఎక్కువగా వినిపిస్తోంది. టెక్ దిగ్గజం, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీని టార్గెట్ చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. “భారత ప్రధాన మంత్రి అంబానీ గారూ..” అంటూ సోషల్ మీడియాలో చేసిన పోస్టులు దుమారం రేపుతున్నాయి. భారత్‌లో తన స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు అనుమతులు లభించడంలో తీవ్ర జాప్యం జరుగుతుండటంపై అసహనం వ్యక్తం చేశారు. దేశీయ టెలికాం రంగాన్ని శాసిస్తున్న ముకేశ్ అంబానీ ప్రయోజనాల కోసమే తమకు అడ్డంకులు సృష్టిస్తున్నారని, ఇది ముమ్మాటికీ గుత్తాధిపత్యమేనని ఆరోపించారు. భారత్‌లో తన స్టార్ లింక్ ఇంటర్నెట్ సేవలకు అడ్డంకులు తొలగకపోవడంతో రిలయన్స్ అధినేతను, కేంద్రంలో అధికారంలో ఉన్న ఔఆం బీజేపీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఎలాన్ మస్క్ సంచలన ఆరోపణలు చేశారు. శాటిలైట్ స్పెక్ట్రమ్ కేటాయింపులు, భారత్‌లోకి స్టార్‌లింక్ ప్రవేశంపై రిలయన్స్ జియోతో వివాదం నడుస్తున్న సమయంలో ఎలాన్ మస్క్ పాత పోస్టులు షేర్ చేసి అటు కేంద్రంలోని బీజేపీని, ఇటు అంబానీని ఇరుకున పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. తన ఆరోపణలకు బలం చేకూర్చేందుకు ఎలాన్ మస్క్ ఎక్స్ వేదికగా ‘ఇండియన్ ఎక్స్‌ప్రెస్’, ‘అల్ జజీరా’ గతంలో రాసిన కథనాలను షేర్ చేశారు. ఎలక్టోరల్ బాండ్ల) ద్వారా రిలయన్స్ అనుబంధ సంస్థగా ప్రచారంలో ఉన్న ‘క్విక్ సప్లై’ కంపెనీ, అధికార బీజేపీకి రూ. 385 కోట్లు, శివసేన పార్టీకి రూ. 25 కోట్లు విరాళంగా ఇచ్చిందని ఆ కథనాల్లో కనిపిస్తుంది. బీజేపీకి అందిస్తున్న విరాళాల ద్వారానే రిలయన్స్ అధినేత అంబానీ మద్దతు పొందుతున్నారని మస్క్ ఆరోపించారు. అయితే, క్విక్ సప్లై కంపెనీ ఇండిపెండెంట్ సంస్థ అని, దాంతో తమకు ఎలాంటి సంబంధం లేదని రిలయన్స్ ఇదివరకే క్లారిటీ ఇచ్చింది. మస్క్ చేసిన తాజా వ్యాఖ్యలపై రిలయన్స్ నేరుగా స్పందించలేదు. వెనిజులాలో స్టార్ లింక్ సేవలు ప్రారంభమవుతున్నాయని, అందుకు కావాల్సిన అన్ని పర్మిషన్లు వచ్చాయని మస్క్ మరో పోస్ట్ చేశారు. ఎలాన్ మస్క్ ఆరోపణలను భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. భారత్ ఏ రంగంలోనూ గుత్తాధిపత్యాన్ని అనుమతించదని, అన్ని సంస్థలకు ఒకే విధమైన రూల్స్ ఉంటాయని తెలిపింది. ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌తో పాటు జియో శాటిలైట్, భారతీ ఎయిర్‌టెల్ మద్దతున్న వన్ వెబ్ కంపెనీలకు కూడా ప్రాథమిక లైసెన్సులు ఇచ్చామని కేంద్రం పేర్కొంది.

# యూపీఐ ఎండీఆర్ వాయిదా..

## కేంద్రం నిర్ణయానికి వ్యాపార సంఘాలు కృతజ్ఞతలు

**యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధింపు వాయిదా**

**అక్టోబర్ 15 తర్వాత అమలు చేయాల్సిన నిర్ణయాన్ని పొడిగించిన కేంద్రం**

**పండగ సీజన్‌లో కేంద్రం నిర్ణయంపై వ్యాపారులు హర్షం**

**ఎండీఆర్‌ను శాశ్వతంగా రద్దు చేయాలని ప్రభుత్వానికి వ్యాపార సంఘాల విజ్ఞప్తి**

**ఈ ఛార్జీలు అంతిమంగా వినియోగదారులపై భారం మోపుతాయని ఆందోళన**




యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ యూపీఐ) లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వాయిదా వేయడంపై వ్యాపార సంఘాలు స్పందించాయి. ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతించాయి.

పండగ సీజన్ ముందు దేశవ్యాప్తంగా ఉన్న వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించిన విషయం తెలిసిందే. యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ విధించే నిర్ణయాన్ని వాయిదా వేసింది. అక్టోబర్ 15 తర్వాత ఈ ఛార్జీలను అమలు చేయాలని తొలుత భావించినప్పటికీ, వ్యాపారుల నుంచి వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో గడువును పొడిగించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన వ్యాపార సంఘాలు, ఎండీఆర్ ప్రతిపాదనను శాశ్వతంగా రద్దు చేయాలని కూడా విజ్ఞప్తి చేశాయి.

యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ విధిస్తే వ్యాపార నిర్వహణ ఖర్చులు పెరుగుతాయని, ముఖ్యంగా దీపావళి వంటి పండగ సీజన్‌లో డిజిటల్ లావాదేవీలు ఎక్కువగా జరిగే సమయంలో ఇది తమపై అదనపు భారం మోపుతుందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న నిర్ణయం వ్యాపారులకు ఉపశమనం కలిగించింది.

ఈ నిర్ణయంపై చాందినీ చౌక్ ట్రేడర్స్ కౌన్సిల్ కోశాధికారి రాజీవ్ అగర్వాల్ మాట్లాడుతూ, “ఇది చాలా మంచి నిర్ణయం. ప్రధాని నరేంద్ర మోదీ మొదటి నుంచి వ్యాపారుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారు. ఎండీఆర్ అమలు నిర్ణయం వాస్తవానికి వ్యాపారులపై గానీ, కొనుగోలుదారులపై గానీ పెద్దగా ప్రభావం చూపేది కాదు. అప్పుడు ఆ నిర్ణయాన్ని స్వాగతించాం. ఇప్పుడు దాని వాయిదాను కూడా స్వాగతిస్తున్నాం” అని ఐఏఎన్ఎస్‌కు తెలిపారు.

సదర్ బజార్ బారీ మార్కెట్ ట్రేడర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పరమ్‌జీత్ సింగ్ మాట్లాడుతూ “ఇది కచ్చితంగా సరైన నిర్ణయం. మేం దీనిని స్వాగతిస్తున్నాం. ఈ అంశంపై మేం నిరసన తెలిపి, పునఃపరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరాం. పండగ సమయంలో ఈ ఛార్జీల వల్ల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు” అని అన్నారు. ఢిల్లీ శారీ మర్కంటైల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రాజ్‌కుమార్ భరద్వాజ్ స్పందిస్తూ.. “ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వ్యాపారులకు, వినియోగదారులకు ఇద్దరికీ ప్రయోజనకరం. ఎందుకంటే ఎండీఆర్ వల్ల వ్యాపారికి ఖర్చు పెరిగితే, ఆ భారాన్ని వస్తువుల ధరలలో కలుపుతారు. దాని ప్రత్యక్ష ప్రభావం వినియోగదారుడిపైనే పడుతుంది” అని వివరించారు. ఈ నిర్ణయం పట్ల ఢిల్లీలోని ఇతర దుకాణదారులు కూడా సంతృప్తి వ్యక్తం చేశారు. యూపీఐపై ఎలాంటి ఛార్జీలు లేకపోవడం వల్ల కస్టమర్లు ఎలాంటి సంకోచం లేకుండా డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారని పేర్కొన్నారు.

## రైల్వే ఉద్యోగులకు కేంద్రం పండగ కానుక.. 78 రోజుల వేతనం బోనస్!

**కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయానికి ఆమోదం**

**సుమారు 11.40 లక్షల మంది నాన్-గెజిటెడ్ సిబ్బందికి లబ్ధి**

**ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 చొప్పున చెల్లింపు**

**పనితీరును ప్రోత్సహించేందుకే ఈ నిర్ణయమన్న రైల్వే శాఖ**

దసరా, దీపావళి పండగల సీజన్‌కు ముందు భారతీయ రైల్వే ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రైల్వే శాఖలోని నాన్-గెజిటెడ్ ఉద్యోగులకు 78 రోజుల వేతనానికి సమానమైన ఉత్పాదకత ఆధారిత బోనస్ ఇచ్చే ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా దాదాపు 11.40 లక్షల మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు.

ఈ బోనస్ రైల్వే శాఖలోని గ్రూప్-సి ఉద్యోగులకు వర్తిస్తుంది. వీరిలో ట్రాక్ మెయింటెనర్లు, లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు, స్టేషన్ మాస్టర్లు, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, టెక్నీషియన్ హెల్పర్లు, పాయింట్స్‌మెన్ వంటి కీలక సిబ్బంది ఉన్నారు. రైల్వేలలో వీరి పాత్రను గుర్తిస్తూ ప్రభుత్వం ఈ ప్రోత్సాహకాన్ని ప్రకటించింది.

బోనస్‌ను 78 రోజుల వేతనంగా లెక్కించినప్పటికీ, చెల్లింపుల పరిమితుల ప్రకారం ప్రతి ఉద్యోగికి గరిష్ఠంగా రూ. 17,951 మాత్రమే అందుతుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రైల్వేల పనితీరును పరిగణనలోకి తీసుకుని ఈ బోనస్‌ను ఖరారు చేశారు. ఆ ఆర్థిక సంవత్సరంలో భారతీయ రైల్వేస్ రికార్డు స్థాయిలో 1,670 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేయడంతో పాటు, సుమారు 741 కోట్ల మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చింది.

ఉద్యోగుల అంకితభావం, కృషిని గుర్తించి వారిలో స్ఫూర్తిని నింపేందుకే ఈ బోనస్‌ను అందిస్తున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మెరుగైన పనితీరు కనబరిచేలా సిబ్బందిని ప్రోత్సహించడం దీని ముఖ్య ఉద్దేశమని పేర్కొంది. బోనస్ చెల్లింపుల కోసం అవసరమైన నిధులను ఇప్పటికే కేటాయించినట్లు అధికారులు స్పష్టం చేశారు. పండగల వేళ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రైల్వే ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలపై బీజేపీ ఫోకస్

హైదరాబాద్ అక్టోబరు 14 తెలంగాణలో జరగబోయే రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసే ప్రక్రియను భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ముమ్మరం చేసింది. ఈసారి టికెట్ల కోసం గతంలో ఎన్నడూ లేనంతగా ఆశావహులు పోటీ పడుతుండటంతో, ఎంపిక ప్రక్రియ ఆసక్తికరంగా మారింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ స్థానానికి సిట్టింగ్ ఎమ్మెల్సీ, పార్టీ సీనియర్ నేత ఎన్. రాంచందర్‌రావు పేరు బలంగా వినిపిస్తున్నప్పటికీ, పలువురు సీనియర్లు గట్టిగా లాబీయింగ్ చేస్తుండటంతో పార్టీలో ఉత్కంఠ నెలకొంది. ఈ రెండు స్థానాలకు సంబంధించి ఆశావహుల నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు బీజేపీ రెండు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. మంగళవారం ఈ కమిటీలు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతల నుంచి అభిప్రాయాలను స్వీకరించాయి. ఈ నివేదికలను బుధవారం రాష్ట్ర నాయకత్వానికి అందజేయనున్నాయి. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల స్థానానికి సుమారు 13 మంది, నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి ఏడుగురు నేతలు పోటీలో ఉన్నారు. హైదరాబాద్ స్థానానికి రాంచందర్‌రావుతో పాటు పార్టీ అధికార ప్రతినిధి ఎన్‌వీ సుభాష్, డోకూరి పవన్‌కుమార్, గౌతమ్ రావు, శ్రీవర్ధన్ రెడ్డి వంటి నేతలు టికెట్ ఆశిస్తున్నారు. అయితే, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తన అనుచరుడైన పవన్‌కుమార్‌కు టికెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నట్లు సమాచారం. మరోవైపు నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానాన్ని బీసీ అభ్యర్థికి కేటాయించాలనే యోచనలో పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ స్థానం కోసం పీఆర్‌టీయూ నేత భిక్షంగౌడ్, పుల్లారావు యాదవ్, డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, కాసం వెంకటేశ్వర్లు తదితరులు పోటీ పడుతున్నారు. రాష్ట్ర నాయకత్వం కమిటీల నివేదికలను పరిశీలించి, ప్రతి స్థానానికి ముగ్గురి పేర్లతో ఒక జాబితాను సిద్ధం చేసి జాతీయ నాయకత్వానికి పంపనుంది. దసరా పండుగ తర్వాత తుది అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. పార్టీ వ్యూహం ప్రకారం, ఒక స్థానాన్ని ఓపెన్ కేటగిరీకి, మరొకటి బీసీ వర్గానికి కేటాయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు మార్చి 2027లో ఎన్నికలు జరగనున్నాయి.

## డ్రైవింగ్ చేస్తూ సినిమా చూస్తున్న ఆటో డ్రైవర్ వీడియోపై వీసీ సజ్జనార్ స్పందన

హైదరాబాద్ అక్టోబరు 14 డ్రైవింగ్ చేస్తూ సినిమా చూడటం, చెవులకు హెడ్‌ఫోన్స్ పెట్టుకోవడం వంటి నిర్లక్ష్యపూరిత చర్యలపై హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ తీవ్రంగా స్పందించారు. ఓ ఆటో డ్రైవర్ ఒకేసారి రెండు ఫోన్లు వాడుతూ, చెవులకు హెడ్‌ఫోన్స్ పెట్టుకుని సినిమా చూస్తూ వాహనం నడుపుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ డ్రైవర్‌ను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒక నెటిజన్ పంపిన ఈ వీడియోపై సజ్జనార్ తన ‘ఎక్స్’ ఖాతాలో స్పందించారు. “రెండు కళ్లకు ఎదురుగా రెండు ఫోన్లు, ఒక దాంట్లో నావిగేషన్, మరో దాంట్లో సినిమా, చెవులకు పెద్ద హెడ్‌ఫోన్లు. ఇది చూడటానికి గేమింగ్ విన్యాసంలా ఉన్నా, ప్రయాణికుల పాలిట నడుస్తున్న మృత్యుశకటం” అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. డ్రైవింగ్ సమయంలో క్షణకాలం దృష్టి మళ్లినా ఘోర ప్రమాదాలు జరుగుతాయని ఆయన హెచ్చరించారు. ఇలా సినిమా చూస్తూ వాహనం నడపడం కేవలం నిర్లక్ష్యం మాత్రమే కాదని, క్షమించరాని నేరమని స్పష్టం చేశారు. మోటార్ వెహికిల్ యాక్ట్ ప్రకారం ఇది ‘ప్రమాదకర డ్రైవింగ్’ కిందకు వస్తుందని, దీనికి భారీ జరిమానాతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కూడా రద్దయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. వినోదం కోసం ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెట్టవద్దని, ఆటోను థియేటర్‌గా మార్చి జీవితాలకు ‘ది ఎండ్’ కార్డు వేయొద్దని ఆయన హెచ్చరించారు. ఈ విషయంలో ప్రయాణికులు కూడా అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ సూచించారు. డ్రైవర్ ఫోన్ చూస్తున్నా, హెడ్‌ఫోన్లు పెట్టుకున్నా మౌనంగా ఉండవద్దని, వెంటనే ప్రశ్నించి వారించాలని కోరారు. వారు వినని పక్షంలో డయల్ 112కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో, వీడియోలో కనిపించిన టీజీ15యూ2657 నంబర్ గల ఆటో డ్రైవర్‌ను గుర్తించి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులను ఆదేశించినట్లు సజ్జనార్ వెల్లడించారు

RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 15 అక్టోబర్ 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:118

# తెలంగాణలో పుట్టడమే

## అదృష్టంగా భావించేలా సంక్షేమ పథకాలు

**పుట్టినప్పటి నుంచి వృద్ధాప్యం వరకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుంది,**
**అచ్చంపేట ప్రాంతానికి నాకు 46 ఏండ్ల అనుబంధం ఉంది,**
**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**
**మన్ననూర్‌లో రూ.53.78 కోట్లతో 220/30**
**కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన**
**పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట**

తెలంగాణ రాష్ట్రంలో పుట్టడమే అదృష్టంగా భావించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పుట్టినప్పటి నుంచి వృద్ధాప్యం వరకు ప్రజలకు అండగా నిలుస్తూ, ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.



పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, వృద్ధులు సహా సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలో రూ.53.78 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 220/30 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ......, రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిస్తున్న ఆర్థిక సహాయం, రైతుల సంక్షేమం, మహిళలకు కల్పిస్తున్న సౌకర్యాలు, యువతకు ఉద్యోగ అవకాశాలు, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర అంశాలను వివరించారు.

ప్రజల అవసరాలను గుర్తించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సంక్షేమం అనేది కేవలం కొన్ని వర్గాలకే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని వర్గాలకు చేరాలని ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం, రైతులకు అండగా నిలవడం, మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు అందించడం, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి జీవనానికి అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం కూడా ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఆర్థిక ప్రయోజనాలు అందించడంతో పాటు విద్యుత్, వైద్యం, ఆహార భద్రత వంటి కీలక రంగాల్లో ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

ప్రజల జీవన ప్రయాణంలోని వివిధ దశల్లో ప్రభుత్వ సహకారం అందేలా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా పెద్ద మొత్తంలో ఆర్థిక ప్రయోజనాలు అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా పథకాలను అమలు చేస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సహాయం చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ప్రజల కొనుగోలు శక్తి పెరగడం, కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గడం, ప్రాథమిక అవసరాలను తీర్చుకోవడంలో పేదలకు వెసులుబాటు కలగడం వంటి అంశాలకు సంక్షేమ కార్యక్రమాలు దోహదపడతాయని ఆయన వివరించారు. ఆహార భద్రత నుంచి ఆరోగ్య సంరక్షణ వరకు, రైతుల సంక్షేమం నుంచి మహిళల ప్రయాణ సౌకర్యాల వరకు పలు రంగాల్లో ప్రభుత్వం కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు.

ప్రజలకు అందించే సంక్షేమ ప్రయోజనాలు కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంతో పాటు సామాజిక భద్రతను బలోపేతం చేయడానికి ఉపయోగపడతాయని తెలిపారు.

మిగతా 4 లో

# భయపడొద్దు, పెట్టుబడులు పెట్టండి

## 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీ: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ అక్టోబరు 14 2047వ సంవత్సరం నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈరోజు 'సమాఖ్య బిజినెస్ సమ్మిట్–2026'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక ప్రగతిపై తమ ప్రభుత్వ దార్శనికతను వివరించారు. ఈ భారీ లక్ష్య సాధనలో భాగంగా 2034 నాటికి రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్ర ప్రగతి ప్రణాళికలు ఉన్నాయని, ఈ లక్ష్య సాధనకు కేంద్ర, రాష్ట్రాల సహకారం అవసరమని అన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని... అభివృద్ధి విషయంలో కాదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 2034 నాటికి రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. బిజినెస్ సమ్మిట్–2026 ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. 2047 నాటికి భారత్ స్వాతంత్ర్యం సాధించి 100 ఏళ్లు పూర్తిచేసుకోనుందని సీఎం రేవంత్ గుర్తుచేశారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు రాష్ట్రాల సహకారం అవసరమన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు ఉండాలని, అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ లక్ష్యంతోనే 2025లో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసినట్లు రేవంత్ రెడ్డి తెలిపారు.



తెలంగాణను మూడు ప్రాంతాలుగా విభజించి అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రేవంత్ రెడ్డి వివరించారు.

ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతంలో ఐటీ, సేవారంగం, అత్యాధునిక సాంకేతికత, ఆవిష్కరణలకు ప్రాధాన్యం.

ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు తయారీ పరిశ్రమలు, పారిశ్రామిక పార్కులు, లాజిస్టిక్స్ రంగాల అభివృద్ధి.

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయాధారిత పరిశ్రమలు, ఉపాధి అవకాశాల కల్పన.

ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతంగా ఉందని, దాన్ని 10 శాతానికి పెంచేందుకు కృషి చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు.

చార్మినార్ తర్వాత హైదరాబాద్‌లో వ్యాపార అభివృద్ధికి హైటెక్ సిటీ మరో కీలక కేంద్రంగా మారిందని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణకు చెందిన పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టి అంతర్జాతీయ స్థాయిలో ఎదగాలని ఆకాంక్షించారు. నూతన పారిశ్రామిక విధానంలో భాగస్వాములు కావాలని వ్యాపారవేత్తలకు పిలుపునిచ్చారు. ఆర్థికాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కీలకమని సీఎం అన్నారు. తెలంగాణలో మహిళలకు రూ.61 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్ల నిర్వహణలో మహిళలను యజమానులుగా ప్రోత్సహిస్తున్నామని వివరించారు. యువతతో పాటు మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు సూచించారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని, మంచి విధానాలను కొనసాగిస్తుందని భరోసా ఇచ్చారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యంగా ప్రభుత్వం, పారిశ్రామికవేత్తలు కలిసి కట్టుగా ముందుకు సాగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతంగా ఉందని, దీన్ని 10 శాతానికి చేర్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని వివరించారు. హైదరాబాద్‌కు ఉన్న 400 ఏళ్ల కాస్మోపాలిటన్ సంస్కృతిని గుర్తుచేస్తూ, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. యువత, మహిళలు పారిశ్రామిక రంగంలోకి ఎక్కువగా రావాలని పిలుపునిచ్చారు. సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఈ రెండు రోజుల సదస్సు జరుగుతుండగా, ప్రారంభోత్సవంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

**విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము**
**నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు**
**గన్నవరం విమానాశ్రయంలో రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికిన ప్రముఖులు**
**ఆలయంలో వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్న రాష్ట్రపతి**
**దర్శనం కోసం వేచి ఉన్న భక్తులను ఆప్యాయంగా పలకరించిన ముర్ము**

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న వేళ ఆమె అమ్మవారి సన్నిధికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఈ పర్యటన కోసం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కమలేశ్ పాశ్వాన్, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, ఎంపీ వల్లభనేని బాలశౌరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఇంద్రకీలాద్రికి చేరుకున్న రాష్ట్రపతికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్ర హోంమంత్రి అనిత, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ ఆమెను ఆలయంలోకి ఆహ్వానించారు. గర్భాలయంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, వేద పండితులు రాష్ట్రపతికి వేదాశీర్వచనాలు అందించారు. ఆలయ అధికారులు ఆమెకు పట్టువస్త్రాలు, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులను రాష్ట్రపతి ఆప్యాయంగా పలకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ ఆమె ముందుకు సాగారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**కేటాయింపుల్లో రాజకీయాలకు తావులేదు.. అర్హతే ప్రామాణికం**
**పోచారంలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి**

మేడ్చల్––మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, అక్టోబరు 14: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయాలకు తావులేదని, అర్హతే ప్రామాణికంగా ఇళ్లను కేటాయిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మేడ్చల్––మల్కాజిగిరి జిల్లా పోచారంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డితో కలిసి ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు.



మిగతా 5 లో

ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదలకు గౌరవప్రదమైన నివాసం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. హైదరాబాద్‌లో భూముల ధరలు ఎకరాకు వందల కోట్ల రూపాయలకు చేరినా, ఉపాధి కోసం నగరంలో నివసించే పేదలను దూర ప్రాంతాలకు తరలించకుండా వారు నివసించే ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు.

**తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో**
**నేడు ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు**

వార్తా 12 లో

# తెలంగాణలో పుట్టడమే అదృష్టంగా భావించేలా సంక్షేమ పథకాలు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో ఆహార భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణలో సుమారు 1.10 కోట్ల కుటుంబాలు ఉండగా, వాటిలో 1.06 కోట్ల కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ప్రతి కుటుంబంలోని ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు.

పేద కుటుంబాలకు నాణ్యమైన ఆహారం అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. కుటుంబాలపై నిత్యావసరాల ఖర్చు భారం తగ్గించడంతో పాటు ఆహార భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

సన్న బియ్యం పంపిణీ ద్వారా 1 కోటి ఆరు లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలుగుతోందని తెలిపారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అర్హులైన ఒక కోటి 15 లక్షల కుటుంబాలకు రూ.10 లక్షల వరకు వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు.

ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం వల్ల పేద కుటుంబాలు నాణ్యమైన వైద్యసేవలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య సహాయం అందిస్తున్నామని చెప్పారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో పడకుండా వైద్య ఖర్చుల విషయంలో భరోసా కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులో ఉండటం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని ఆయన అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి వైద్యరంగంలో ప్రజలకు అవసరమైన సేవలు అందించడం ముఖ్యమని పేర్కొన్నారు.

సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో 43 లక్షల మందికి చేయూత పింఛన్లు అందిస్తున్నామని వెల్లడించారు.

వృద్ధాప్యం, దివ్యాంగత్వం, ఇతర అర్హతలకు సంబంధించిన పరిస్థితుల్లో ఉన్నవారికి ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి జీవనానికి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులపై పూర్తిగా ఆధారపడకుండా లబ్ధిదారులు తమకు అవసరమైన కొన్ని ఖర్చులను నిర్వహించుకునేందుకు పింఛన్లు తోడ్పడతాయని తెలిపారు.

సమాజంలోని బలహీన వర్గాలకు గౌరవప్రదమైన జీవనం అందేలా చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యతని ఆయన అన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో 72 లక్షల మంది రైతులకు రైతు బీమా పథకానికి సంబంధించిన నిధులు జమ చేస్తున్నామని తెలిపారు.

వ్యవసాయం అనేక కుటుంబాలకు ప్రధాన జీవనాధారమని, రైతు కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడం అవసరమని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంపై ఆధారపడిన కుటుంబాలకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు.

రైతులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి కుటుంబాలకు సామాజిక, ఆర్థిక భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతుల సంక్షేమం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కీలకమని తెలిపారు.

రాష్ట్రంలో 53 లక్షల మందికి ఉచిత విద్యుత్ అందిస్తున్నామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ప్రజలకు విద్యుత్ సదుపాయం అందుబాటులో ఉండటం కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలకమని తెలిపారు.

విద్యుత్ అనేది గృహావసరాలతో పాటు విద్య, ఉపాధి, చిన్న వ్యాపారాలు, వ్యవసాయం తదితర రంగాలకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతో పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

విద్యుత్ రంగంలో మౌలిక సదుపాయాలు బలోపేతం కావడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.

మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

మహిళలు విద్య, ఉద్యోగం, వైద్య అవసరాలు, వ్యాపార కార్యకలాపాలు, ఇతర వ్యక్తిగత అవసరాల కోసం ప్రయాణాలు సాగించాల్సి ఉంటుందని ఆయన వివరించారు. ఇటువంటి సందర్భాల్లో ప్రయాణ ఖర్చుల భారం తగ్గించడం ద్వారా మహిళలకు కొంత ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు అవసరమైన అవకాశాలు కల్పించడం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. మహిళల సంక్షేమం, వారి ఆర్థిక స్వావలంబన, సామాజిక పురోగతికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్య అంశాల్లో ఒకటని భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 76 వేల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించినట్లు వెల్లడించారు.

యువతకు ఉపాధి లభించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కలగడంతో పాటు సమాజంలో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని పేర్కొన్నారు. చదువుకున్న యువత తమ నైపుణ్యాలను ఉపయోగించుకునేందుకు తగిన అవకాశాలు లభించడం అవసరమని అన్నారు.

యువత ఆకాంక్షలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఉద్యోగాల ద్వారా యువత స్వయం సమృద్ధి సాధించడంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావచ్చని పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో విద్యుత్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. వ్యవసాయం, గృహావసరాలు, విద్య, వైద్యం, చిన్న పరిశ్రమలు, వ్యాపార కార్యకలాపాలు సజావుగా సాగేందుకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవసరమని తెలిపారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు భవిష్యత్తులో పెరిగే విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి

విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని వివరించారు.

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలో రూ.53.78 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 220/30 కేవీ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేయడం తనకు ప్రాధాన్యత సంతరించుకుందని తెలిపారు.

ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం ద్వారా స్థానిక విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి తోడ్పాటు లభించనుంది. ప్రాంతీయ విద్యుత్ అవసరాలను తీర్చేందుకు అవసరమైన వ్యవస్థలను అభివృద్ధి చేయడం గ్రామీణ ప్రాంతాల పురోగతికి కీలకమని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం, పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందించడం, రైతులకు భరోసా కల్పించడం, మహిళలకు సౌకర్యాలు కల్పించడం, యువతకు ఉపాధి అవకాశాలు అందించడం వంటి అంశాలు రాష్ట్ర అభివృద్ధిలో కీలకమని తెలిపారు.

ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనం కలగడంతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తూ, అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి కుటుంబం అభివృద్ధి ఫలాలను అందుకోవాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు ఆర్థిక భరోసా, రైతుల అభ్యున్నతి, మహిళల సాధికారత, యువతకు ఉపాధి, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మల్లు భట్టి విక్రమార్క వివరించారు.

అచ్చంపేట నియోజకవర్గం ఒకప్పుడు మారుమూల ప్రాంతంగా ఉండేదని రానున్న రోజుల్లో అచ్చంపేట నియోజకవర్గంలో ఒక మంచి జంక్షన్ గా మారబోతున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

?రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందని కుటుంబం లేదని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గత మూడేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.1,64,431 కోట్లను నేరుగా ప్రజల ఖాతాల్లోకి జమ చేశామని వెల్లడించారు. ఈ లెక్కలపై ఎవరితోనైనా చర్చించేందుకు, ఎలాంటి సవాల్‌నైనా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రతి రూపాయిని వారి అభివృద్ధి, సంక్షేమం కోసమే ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేస్తున్నామని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు కేటాయించామని, జిల్లాల్లో అందుబాటులో ఉన్న సహజ వనరులు, నదులు, ఖనిజ సంపద, మానవ వనరుల ఆధారంగా ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగుతామని చెప్పారు. అచ్చంపేట ప్రాంతాన్ని ప్రధాన రవాణా కూడలిగా అభివృద్ధి చేయడంతోపాటు, పర్యాటక రంగం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు.

### ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు

రాష్ట్రంలో కోటి 15 లక్షల కుటుంబాలు ఉండగా, కోటి ఆరు లక్షల కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనాలు అందుతున్నాయని భట్టి విక్రమార్క వివరించారు. పేదల ఆహార భద్రతకు ప్రాధాన్యమిస్తూ ప్రతి వ్యక్తికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో కిలో సన్నబియ్యం ధర రూ.60 నుంచి రూ.70 వరకు ఉన్నప్పటికీ, పేదలకు ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. దాదాపు కోటి ఆరు లక్షల కుటుంబాలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. 43 లక్షల కుటుంబాలకు చేయూత పింఛన్లు అందిస్తున్నామని, 71.40 లక్షల మంది రైతులకు రైతు భరోసా కింద ఎకరానికి ప్రతి సీజన్‌లో రూ.6 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలోని 53 లక్షల కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని తెలిపారు. రైతు భరోసా, పంట రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాల ద్వారా అర్హులైన ప్రజలకు ప్రయోజనాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సుమారు 76 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించామని చెప్పారు. ఏడు లక్షల మంది పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. కేవలం అచ్చంపేట నియోజకవర్గంలోనే 7,300 ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తూ పేదలకు సొంతింటి కలను నిజం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామని, వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగిజావ ఇస్తున్నామని చెప్పారు. కళాశాలల్లో చదువుతున్న సుమారు 12 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా రోడ్డున పడకూడదనే ఉద్దేశంతో, నవంబర్ 19న ఇందిరమ్మ జయంతి సందర్భంగా కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా ప్రతి కుటుంబానికీ వర్తించేలా ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని వెల్లడించారు.

### రహదారులకు రూ.90 వేల కోట్లు

?తెలంగాణను సమగ్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో భారీగా మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు కేటాయించామని చెప్పారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో రీజినల్ రింగ్ రోడ్డు, మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, క్లస్టర్ డెవలప్‌మెంట్ వంటి ప్రాజెక్టులపై దృష్టి సారించామని వివరించారు. రాష్ట్ర అభివృద్ధిని హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా ప్రతి జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులను గుర్తించి, వాటికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. నదులు, ఖనిజ సంపద, వ్యవసాయం, పర్యాటకం, మానవ వనరులను సమర్థంగా వినియోగించుకొని జిల్లాలవారీగా ఆర్థిక ప్రగతిని సాధిస్తామని స్పష్టం చేశారు.

### అచ్చంపేట అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

?అచ్చంపేట నియోజకవర్గంతో తనకు 1980 నుంచి విడదీయలేని అనుబంధం ఉందని భట్టి విక్రమార్క గుర్తు చేసుకున్నారు. తన సోదరుడు స్వర్గీయ మల్లు అనంతరాములు ఈ ప్రాంతం నుంచి పార్లమెంటుకు పోటీ చేసిన రోజుల నుంచి ఇక్కడి గ్రామాలతో తనకు పరిచయం ఉందని చెప్పారు. విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి ఈ ప్రాంతంలోని అనేక గ్రామాల్లో పర్యటించానని, ప్రజల సమస్యలను దగ్గరగా చూశానని తెలిపారు.

?గతంలో ఈ ప్రాంత ప్రజలు ప్రధానంగా విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం విద్యుత్ శాఖ తన వద్ద ఉండటంతో సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అచ్చంపేట నియోజకవర్గంలో ఇప్పటికే 1,219 కొత్త డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, 403 కిలోమీటర్ల మేర కొత్త విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేశామని, 5 వేల కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని వివరించారు. ఈ పనుల కోసం ఇప్పటికే సుమారు రూ.75 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు, రైతులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. రాబోయే 50 సంవత్సరాల భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేశామని వెల్లడించారు.

### ఎకో టూరిజంతో స్థానికులకు ఉపాధి

?అచ్చంపేట ప్రాంతంలో రహదారులు, ఎలివేటెడ్ కారిడార్లు, కృష్ణానదిపై వంతెనలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందుతున్నాయని తెలిపారు. వీటి ద్వారా అచ్చంపేటను ప్రధాన రవాణా కూడలిగా తీర్చిదిద్దే అవకాశం ఉందన్నారు.

?మన్ననూరు, నల్లమల అటవీ ప్రాంతాలకు ఉన్న సహజ సౌందర్యం, వన్యప్రాణుల సంపదను పర్యాటక అభివృద్ధికి అనుకూలంగా వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక గిరిజన కుటుంబాలు, రైతులు, నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. పర్యాటకులు ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు స్థానికంగా వసతి, ఆతిథ్యం, రవాణా, ఇతర సేవల ద్వారా కుటుంబాలకు ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి ఉన్న ప్రత్యేకతలను గుర్తించి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలు, నిధులు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు.

### ప్రజల సమస్యలే ప్రభుత్వ ప్రాధాన్యాలు

గతంలో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా అచ్చంపేట నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో పర్యటించిన రోజులను భట్టి విక్రమార్క గుర్తు చేసుకున్నారు. 2023 మే 31న లింగాల మండలం అంబటపల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్రలో భాగంగా నియోజకవర్గంలోని సుమారు 42 గ్రామాల్లో 130 కిలోమీటర్ల మేర నడిచామని తెలిపారు. ఆ సమయంలో ప్రజలు పెన్షన్లు, గ్యాస్, పోడు భూములు, విద్యుత్ బిల్లులు, సాగునీరు వంటి సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును సందర్శించినప్పుడు పనులు పూర్తి చేసి నీటిని అందిస్తామని హామీ ఇచ్చామని గుర్తు చేశారు. నక్కలగండి ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయాలనే అంశాన్ని కూడా ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుంటుందని తెలిపారు. ప్రజల నుంచి తెలుసుకున్న సమస్యలను మరిచిపోకుండా, రాష్ట్ర ఆదాయానికి అనుగుణంగా ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 20 వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా చేసినప్పటికీ, దేశవ్యాప్తంగా విద్యుత్ కొరత నెలకొన్న పరిస్థితులు ఉన్నాయని తెలిపారు.

సూపర్ ఎల్‌నినో ప్రభావం తెలంగాణ రాష్ట్రానికే పరిమితం కాదని, ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతోందని తెలిపారు. అనేక ప్రాంతాల్లో తాగునీరు, సాగునీరు, విద్యుత్ లభ్యతకు సంబంధించిన సమస్యలు ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న వనరులను పొదుపుగా వినియోగించుకోవడం, ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవడం అత్యంత ముఖ్యమని తెలిపారు.

రాబోయే రోజుల్లో విద్యుత్ సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందని తెలిపారు.

### డిప్యూటీ సీఎం భట్టి సహకారంతో అచ్చంపేటలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం: ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహకారంతో అచ్చంపేట నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న లో-వోల్టేజీ, విద్యుత్ సరఫరా అంతరాయాల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గతంలో అచ్చంపేట నియోజకవర్గంలో లో-వోల్టేజీ సమస్యతోపాటు వర్షాలు, ఈదురుగాలులు వీచినప్పుడు విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడేదని పేర్కొన్నారు. దీంతో వ్యవసాయ పనులు చేసుకునే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని వివరించారు. ఈ సమస్యలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా, విద్యుత్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు అవసరమైన సబ్‌స్టేషన్ల మంజూరుకు సహకరించారని తెలిపారు.

నియోజకవర్గంలో 14 కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లతోపాటు, 220/33 కేవీ, 132/33 కేవీ సామర్థ్యాలతో మరో రెండు సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం మంజూరు ఇచ్చిందని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ విద్యుత్ మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావడంతో రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు వీలవుతుందని, లో-వోల్టేజీ సమస్యలు తగ్గడంతోపాటు విద్యుత్ అంతరాయాల నుంచి ఉపశమనం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఏర్పాట్లు రానున్న 5 దశాబ్దాల పాటు నియోజకవర్గ విద్యుత్ అవసరాలకు తోడ్పడతాయని పేర్కొన్నారు.

అచ్చంపేట ప్రాంతంలో పర్యాటక రంగ అభివృద్ధికి, సుమారు 500 ఎకరాల్లో పీపీపీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) విధానంలో ఎకో టూరిజం ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహకరిస్తున్నారని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా పర్యాటక రంగం అభివృద్ధి చెందడంతోపాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగేందుకు వీలుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా అచ్చంపేటలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయాలన్న తన విజ్ఞప్తికి స్పందించి, కార్యాలయ ఏర్పాటుకు ప్రభుత్వం జీఓ జారీ చేయడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధికి, రైతుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్, గ్రంథాలయ కమిటీ చైర్మన్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి, ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్, టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్, నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు బి చెన్నయ్య, దేవ సహాయం, విద్యుత్ శాఖ డైరెక్టర్ ఆపరేషన్ నరసింహ, గ్రామ సర్పంచ్ మంజుల, అధికారులు తదితరులు పాల్గొన్నారు

# మద్యం సేవించి వాహనం నడిపిన 43 మందికి నాంపల్లి కోర్టు రూ.2,24,300/-జరిమానా

## 5 గురికి జైలు శిక్ష

### కాచిగూడ ట్రాఫిక్ పోలీస్ ఎస్.హెచ్.ఓ బి.వి. కౌశిక్

హైద్రాబాద్ (అంబర్ పెట్ ,కాచిగూడ) కాచిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపిన 43 మంది పై కాచిగూడ ట్రాఫిక్ పోలీస్ లు కేసునమోదు చేశారు.వారిని



హైదరాబాద్, నాంపల్లి, మనోరంజన్ కాంప్లెక్స్‌లోని ఎనిమిదవ జేఎంఎఫ్‌సి కోర్టు ముందు హాజరుపరుచిగా న్యాయస్థానం మొత్తం 43 కేసులను రూ. 2,24,300/– జరిమానా విధించి పరిష్కరించడం జరిగింది.వీరిలో

మొదటిసారి: 32 కేసులు

రెండవసారి -- 06 కేసులు

జైలు: 5 మంది

సామాజిక సేవ: నిర్వహించాలని కోర్ట్ ఆదేశించినట్లు కాచి గూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ,ఎస్.హెచ్.ఓబి.వి. కౌశిక్ తెలిపారు.

# వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

## ఆరోగ్య కార్యక్రమాలపై డీఎంహెచ్‌వో సమీక్ష..

## విధుల పర్యవేక్షణపై హెచ్చరిక

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, అక్టోబరు 14:జిల్లాలో అమలవుతున్న అన్ని ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించి మాతా శిశు ఆరోగ్యం, గర్భిణుల సంరక్షణ, ప్రసవ సేవలు, వ్యాధి నిరోధక టీకాలు, క్షయ వ్యాధి గుర్తింపు, అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) స్క్రీనింగ్, చికిత్స తదితర





అంశాల పురోగతిని సమీక్షించారు.

గర్భిణులకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించాలని, హైరిస్క్ గర్భిణులను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత సమయంలో ఫాలోఅప్ చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. చిన్నారులకు షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయడంతో పాటు, టీకాలకు దూరమైన పిల్లలను గుర్తించి టీకాలు అందించాలని ఆదేశించారు. టీబీ బాధితులను గుర్తించి సకాలంలో నమోదు చేయడంతో పాటు మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధుల గుర్తింపు, చికిత్స, తదుపరి పర్యవేక్షణను పకడ్బందీగా చేపట్టాలన్నారు.

ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవల నాణ్యతను మెరుగుపరచాలని, ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి సకాలంలో పరీక్షలు, తగిన చికిత్స, అవసరమైన మందులు అందేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన ఆన్‌లైన్ రికార్డులు, నివేదికలను ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారు.

కార్యక్రమాల అమలు, నివేదికల సమర్పణను ప్రతిరోజూ స్వయంగా పర్యవేక్షిస్తానని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం, వైద్య సేవల్లో అలసత్వం వహిస్తే సహించబోమని హెచ్చరించారు. బాధ్యతారాహిత్యం నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను నిర్ణీత సమయంలో సాధించాలని ఆదేశించారు.



నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి: గోషామహల్ నియోజక వర్గంలోని శంకర్ బాగ్ తుల్జాభవాని అమ్మవారి మందిరానికి విచ్చేసిన కేడీసీసీ కార్యదర్శి ఎస్ .ధన్‌రాజ్‌కు స్వాగతం పలికి శాలువ కప్పి సన్మానించి ఆశిర్వదించిన మందిర పంతుల్లు సతీష్ మహారాజ్ ,రత్నేష్ మహరాజ్ ,తివారీ మహరాజ్

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన భూమిలో వాటాను కూడా రిజిస్ట్రేషన్ పత్రాల్లో పొందుపరుస్తామన్నారు. వచ్చే బతుకమ్మ పండుగ నాటికి తొలి విడత ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు అందించడమే లక్ష్యమని తెలిపారు.

తొలి విడతలో అవకాశం దక్కని అర్హులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, తదుపరి విడతల్లో కొత్త దరఖాస్తుదారులతో పాటు అర్హులందరి దరఖాస్తులను పరిశీలిస్తామని పేర్కొన్నారు.

తొలి విడతలో లక్ష ఇళ్ల నిర్మాణం

క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, 23 నియోజకవర్గాల్లో పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే ఆరు ప్రాంతాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలో తొలి విడతగా 480 మంది లబ్ధిదారులను పారదర్శకమైన బహిరంగ లాటరీ ద్వారా ఎంపిక చేసినట్లు వివరించారు.







ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, సొంత ఇళ్లు ఉన్నవారిని గుర్తించి, అర్హతలను నిర్ధారించిన అనంతరం లాటరీ నిర్వహించామన్నారు. స్థానికంగా నివసించే అర్హులకే ఇళ్లు కేటాయిస్తున్నట్లు స్పష్టం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లు మంజూరులి

రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 2.20 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని చెప్పారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ టవర్స్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు.

రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా పూర్తి హక్కులులి

ఇందిరమ్మ టవర్స్‌లో ఎంపికైన లబ్ధిదారులకు కేవలం కేటాయింపు పత్రాలకే పరిమితం కాకుండా, ఎలాంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా పూర్తి హక్కులతో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసి అందజేస్తామని మంత్రి ప్రకటించారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకూ మౌలిక సదుపాయాలులి

గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని మంత్రి తెలిపారు. ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇప్పటివరకు సుమారు రూ.440 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి, సమీప ప్రాంతాల్లోని అర్హులైన పేదలకు నిబంధనల ప్రకారం కేటాయించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.అనంతరం మంత్రులు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ ఛైర్మన్ నర్సింహులు యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ ఎండీ వి.పి.గౌతమ్, కలెక్టర్ మను చౌదరి తదితరులు పాల్గొన్నారు. లబ్ధిదారులు స్నేహ, శివకుమారి, రెహ్మతి ప్రభుత్వ పథకాలను ప్రశంసించారు. అనంతరం ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపు కార్యక్రమం నిర్వహించారు.

# సిరిసిల్లలో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలి

## అన్నారం సాయికుమార్ డిమాండ్



రాజన్న సిరిసిల్ల జిల్లా,అక్టోబర్ 14,(ప్రజాబలం ప్రతినిధి)సిరిసిల్ల పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ప్రజల అవసరాల కోసం నూతన సులభ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సామాజిక కార్యకర్త అన్నారం సాయికుమార్ జిల్లా కలెక్టర్ కోరారు.సిరిసిల్ల పట్టణానికి ప్రతిరోజూ వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రయాణికులు, మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు వస్తుంటారు. అయితే, సరైన సులభ్ కాంప్లెక్స్ సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా మహిళలు, వృద్ధులు,దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. ప్రజారోగ్యం, పారిశుధ్యం దృష్ట్యా సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం అత్యంత అవసరమని పేర్కొన్నారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలి. నూతన సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టి, పనులను వేగవంతం చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారం సాయికుమార్ డిమాండ్ చేశారు.ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం అధికారుల బాధ్యత అని, ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# సిరిసిల్ల మున్సిపల్,మెప్మా బతుకమ్మ సంబరాలు



రాజన్న సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ 14,(ప్రజాబలం ప్రతినిధి)రాజన్న సిరిసిల్ల జిల్లా మున్సిపల్ కార్యాలయము,మెప్మా విభాగం ఆధ్వర్యంలో స్థానిక బతుకమ్మ ఘాటు వద్ద నిర్వహించిన బతుకమ్మ సంబరాల లో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ-చక్రపాణి, కౌన్సిలర్ సభ్యులు దార్నం అరుణ-లక్ష్మీనారాయణ, కూర భాగ్యలక్ష్మి-దేవరాజ్, గుండ్లపల్లి నీరజ-పూర్ణచందర్, మెరుగు మంజుల-శ్రీనివాస్, పాషికంటి రమ్య-సత్యనారాయణ, కొండ వర్షిని-నరేష్ ,కల్లూరి రేణుక-రాజు, ఊరగొండ లక్ష్మీరాజు, రిక్కమల్లె రజిత-సంపత్, ఆకుల స్వప్న-కృష్ణ , మున్సిపల్ మహిళ అధికారులు పాల్గొని బతుకమ్మ ఆడారు...ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండి ఖాదిర్ ఫాషా వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్ సభ్యులు బత్తుల రమేష్,బత్తుల వనజ-రమేష్, , ఫ్యాక్స్ డైరెక్టర్ గడిల సురేష్ కుమార్,మొదలగు పుర ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు..

# వ్యక్తిగత శత్రువులు ..రాజకీయాల్లో ప్రత్యర్థులు



హైదరాబాద్ అక్టోబరు 14 తెలంగాణ రాజకీయాల్లో రోజురోజుకూ ప్రజా సమస్యల ప్రాతిపదికన జరగాల్సిన చర్చలు కనుమరుగవుతూ, వ్యక్తిగత దూషణలు, వ్యక్తిత్వ హనన డిజిటల్ దాడులే ప్రధాన ఎజెండాగా మారుతున్నాయి. ప్రజాస్వామ్యంలో అధికార, ప్రతిపక్షాల మధ్య సిద్ధాంతపరమైన విభేదాలు, ప్రజా విధానాలపై ఆరోగ్యకరమైన విమర్శలు ఉండటం సహజం. అయితే, ప్రస్తుత తెలంగాణ రాజకీయ వాతావరణం ప్రజా సమస్యలను పక్కనపెట్టి, నాయకుల వ్యక్తిగత జీవితాలు, ఆరోగ్యం, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని సాగిస్తున్న క్యారెక్టర్ అస్సాసినేషన్ సంస్కృతికి అద్దం పడుతోంది. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనకు అస్వస్థత, జ్వరం కారణంగా రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకుంటున్నట్లు, అందుబాటులో ఉండటం లేదని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. అయితే, ఒక నాయకుడి అనారోగ్యంపై సానుభూతి ప్రదర్శించాల్సింది పోయి, ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు, సోషల్ మీడియా విభాగం నేతలు దాని వెనుక ఏదో రహస్య కారణం ఉందంటూ కథనాలు అల్లడం మొదలు పెట్టారు. దర్యాప్తు సంస్థల భయం వల్లే ఆయన అనారోగ్యం డ్రామా ఆడుతున్నా రంటూ రకరకాల ఊహాగానాలతో ప్రచారం చేయడం రాజకీయ నైతికత ఏ స్థాయికి దిగజారిందో చాటిచెప్పింది. అదే సమయంలో, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బిఆర్ఎస్ సానుభూతిపరులు, కాంగ్రెస్ వ్యతిరేకులు డిజిటల్ హ్యాండిల్స్ సాగిస్తున్న ప్రచారం కూడా హద్దులు దాటుతోంది. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి వ్యక్తిగత జీవితంపై అసభ్యకరమైన పోస్టులు పెట్టడం, మార్ఫింగ్ ఇమేజ్‌లు, వికృతమైన కంటెంట్‌ను వ్యాప్తి చేయడం పరిపాటిగా మారింది. ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో జుగుప్సాకర వ్యాఖ్యలు చేశారంటూ ఇప్పటికే సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్లలో పలు కేసులు సైతం నమోదయ్యాయి. న్యాయపరమైన చర్యలు హెచ్చరిస్తున్నప్పటికీ, డిజిటల్ వేదికలపై వైరం ఏమాత్రం తగ్గడం లేదు. ఈ రకమైన డిజిటల్ యుద్ధానికి ప్రధాన కారణం ఇరు పార్టీల సోషల్ మీడియా ఆర్మీలు నిర్వహిస్తున్న శైలేనని భావిస్తున్నారు. యూట్యూబ్ ఛానెళ్లు, ఎక్స్ , ఫేస్‌బుక్ , వాట్సాప్ గ్రూపుల ద్వారా కంటెంట్‌ను వైరల్ చేసే క్రమంలో లైకులు, వ్యూస్, రాజకీయాధిపత్యం కోసం ప్రత్యర్థులపై అత్యంత నీచమైన పదజాలాన్ని ఉపయోగిస్తున్నారు. పాలనాపరమైన లోపాలు, విద్యుత్ సంక్షోభం, నిరుద్యోగం, ధరణి లేదా హైడ్రా వంటి ప్రజా సమస్యలపై చర్చించాల్సిన చోట, నాయకుల వ్యక్తిగత బలహీనతలు లేదా వ్యక్తిగత జీవితాలే డిజిటల్ వేదికల్లో ప్రధాన అంశాలుగా మారుతున్నాయి. తెలంగాణ సమాజం చైతన్యవంతమైన రాజకీయ పోరాటాలకు నిలయం. ఉమ్మడి రాష్ట్రంలో హుందాగా సాగిన సిద్ధాంత రాద్ధాంతాలు, హక్కుల పోరాటాల స్థానంలో ఇప్పుడు క్షుద్ర రాజకీయాలు చోటుచేసుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకే చేటు తెస్తోంది. నాయకుల మధ్య శత్రుత్వం కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా వ్యక్తిగత కక్ష సాధింపుగా రూపాంతరం చెందుతుండటంతో, ద్వితీయ శ్రేణి కార్యకర్తలు కూడా క్షేత్రస్థాయిలో పరస్పరం దాడులకు తెగబడే వాతావరణం ఏర్పడుతోంది. ఈ ధోరణికి తక్షణమే అడ్డుకట్ట పడకపోతే, ప్రజా సమస్యలు గాలికి కొట్టుకుపోయి కేవలం బురదజల్లుడు రాజకీయాలే రాజ్యమేలుతాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. తమ పార్టీ సోషల్ మీడియా విభాగాలను అదుపులో ఉంచుకోవాల్సిన ప్రాథమిక బాధ్యత అగ్రనాయకత్వానిదే. వ్యక్తిగత దూషణలను, వికృతమైన డిజిటల్ పోస్టులను ఖండిస్తూ సీనియర్ నేతలు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసినప్పుడే తెలంగాణ రాజకీయాల్లో పోగొట్టుకున్న హుందాతనాన్ని మళ్లీ పునరుద్ధరించడం సాధ్యమవుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# ఓవైపు విద్యుత్ కొరత..
# మరోవైపు అదనపు బిల్లుల భారం

హైదరాబాద్ అక్టోబరు 14 తెలంగాణలో విద్యుత్ సంక్షోభం, మరోవైపు ట్రూ-అప్ చార్జీల భారం రాష్ట్ర ప్రభుత్వానికి కొత్త సవాళ్లను విసురుతున్నాయి. మండుతున్న ఎండలు, వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయంతో పాటు పారిశ్రామిక రంగంలో పెరిగిన విద్యుత్ అవసరాలు సరఫరా వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి. రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరగా, అక్కడక్కడా అప్రకటిత విద్యుత్ కోతలు, లో-వోల్టేజీ సమస్యలపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. రూ.5,420.23 కోట్ల ట్రూ-అప్ చార్జీలను వ్యవసాయేతర వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నారు. ఇదే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయంగా సవాలుగా మారింది. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన విద్యుత్ కొనుగోళ్లు, అదనపు వ్యయాలు, ఆదాయ లోటుల సర్దుబాటులో భాగంగా తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) మొత్తం రూ.7,635.22 కోట్ల ట్రూ-అప్ చార్జీల వసూలుకు అనుమతించినట్లు సమాచారం. ఇందులో వ్యవసాయ రంగానికి సంబంధించిన రూ.2,214.99 కోట్ల భారాన్ని ప్రభుత్వం భరించనుండగా, మిగిలిన రూ.5,420.23 కోట్లను వ్యవసాయేతర వినియోగదారుల నుంచి దశలవారీగా వసూలు చేయనున్నారు. ఇప్పటికే ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు అదనపు విద్యుత్ బిల్లుల భారం మరింత భారంగా మారే అవకాశం ఉంది. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను కొనసాగించేందుకు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అవసరమైన విద్యుత్‌ను బహిరంగ మార్కెట్ నుంచి కొనుగోలు చేయడంతో పాటు థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాపై దృష్టి సారిస్తోంది. ఎత్తిపోతల పథకాలకు పీక్ అవర్స్‌కు బదులుగా ఆఫ్-పీక్ సమయాల్లో విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించడం, నగరాల్లో సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచడం, గ్రిడ్ నిర్వహణను మెరుగుపరచడం వంటి చర్యలను అమలు చేయాలని భావిస్తోంది. విద్యుత్ సమస్యలను అస్త్రంగా చేసుకుని ప్రతిపక్ష బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తోంది. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆరోపిస్తోంది. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందిస్తూ గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన డిస్కంల బకాయిలు, ఆర్థిక సమస్యలే ప్రస్తుత పరిస్థితికి కారణమని వివరిస్తోంది. అయితే గత ప్రభుత్వాలపై విమర్శలు చేయడం కంటే ప్రస్తుత సమస్యలకు పరిష్కారం చూపించడమే ముఖ్యమని ప్రజలు భావిస్తున్నారు. దీర్ఘకాలికంగా విద్యుత్ కొరతను అధిగమించేందుకు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ మిగిలిన యూనిట్ల పనులను వేగవంతం చేయడం, సౌర విద్యుత్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను ప్రోత్సహించడం వంటి చర్యలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. వ్యవసాయ విద్యుత్‌కు సంబంధించిన బకాయిలను డిస్కంలకు సకాలంలో చెల్లించడం ద్వారా పంపిణీ సంస్థల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాలని భావిస్తోంది. ఒకవైపు నిరంతరాయ విద్యుత్ సరఫరా కల్పించాల్సిన బాధ్యత, మరోవైపు వేల కోట్ల రూపాయల ట్రూ-అప్ చార్జీలను ప్రజలపై మోపాల్సిన పరిస్థితి.. ఈ రెండింటి మధ్య రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇబ్బందికరమైన పరీక్షను ఎదుర్కొంటోంది. విద్యుత్ బిల్లుల భారం వినియోగదారుల్లో అసంతృప్తిని పెంచే అవకాశం ఉండగా, కోతలు కొనసాగితే ప్రజాగ్రహం మరింత పెరిగే ప్రమాదం ఉంది. రాబోయే పండుగలు, వ్యవసాయ సీజన్లలో విద్యుత్ సరఫరాను మెరుగుపరచడంతో పాటు అదనపు చార్జీల విషయంలో ప్రజలకు స్పష్టత ఇవ్వగలిగితేనే ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోగలదు. లేకుంటే విద్యుత్ కష్టాలు, ట్రూ-అప్ భారం రాజకీయంగా కాంగ్రెస్ సర్కార్‌కు పెద్ద తలనొప్పిగా మారే అవకాశం ఉంది.

# సిద్ధిపేటలో రేవంత్ టూర్.. అప్రమత్తమైన హరీశ్!

సిద్ధిపేట, అక్టోబరు 14 తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ యుద్ధం ముదురుతోంది. బీఆర్ఎస్ కీలక నేతల నియోజకవర్గాలను ప్రధాన లక్ష్యంగా చేసుకుని సీఎం రేవంత్ రెడ్డి దూకుడు పెంచారు. ప్రత్యక్షంగా అక్కడికి వెళ్లడం, బహిరంగ సభలు నిర్వహించడం, తద్వారా స్థానిక నేతల అక్రమాలు, వైఫల్యాలను ఎండగట్టడం కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే సిరిసిల్ల పర్యటన పూర్తి చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, తదుపరి అస్త్రాన్ని హరీశ్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్ధిపేటపై ప్రయోగించడానికి సిద్ధమవుతున్నారు. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఇటీవల బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ పర్యటనలో కేటీఆర్‌కు సంబంధించిన ఆరోపణలు, అక్రమాస్తులు, హోటళ్ల అంశాలను రేవంత్ రెడ్డి బహిరంగంగానే ప్రస్తావించారు. ఈ ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ కలకలం రేపాయి. ఆ తర్వాత రేవంత్ రెడ్డి ప్రస్తావించిన ఆ హోటళ్లు తనవేనని కేటీఆర్ కూడా బహిరంగంగా అంగీకరించడంతో ఈ అంశం మరింత ఊపందుకుంది. ఈ క్రమంలోనే సిరిసిల్ల తరహాలోనే హరీశ్ రావు నియోజకవర్గమైన సిద్ధిపేటను కూడా టార్గెట్ చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. సీఎం రేవంత్ రెడ్డి సిద్ధిపేట పర్యటన ఖాయమన్న సంకేతాలు వెలువడటంతో హరీశ్ రావు ముందుగానే అప్రమత్తమయ్యారు. తెలంగాణలో కొత్త జిల్లాలు ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా సిద్ధిపేటలో ఆయన భారీ సభ నిర్వహించారు. వాస్తవానికి రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సభలు నిర్వహించాలని బీఆర్ఎస్ పిలుపునిచ్చినా మిగిలిన చోట్ల ఆశించిన స్పందన రాలేదు. కానీ హరీశ్ రావు మాత్రం దీన్ని తనకు అనుకూలంగా మలచుకోవడంలో సఫలమయ్యారు. ఈ సమావేశాన్ని తన రాజకీయ బలప్రదర్శనకు చక్కని వేదికగా ఉపయోగించుకున్నారు. త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి సిద్ధిపేటకు వస్తారని, తనపై తీవ్రస్థాయిలో విమర్శలు, ఆరోపణలు గుప్పిస్తారని హరీశ్ రావు ఈ సభలో ముందుగానే శ్రేణులకు వివరించారు. తనపై వచ్చే తుక్కు తుక్కు ఆరోపణలను నమ్మవద్దని ఆయన తన అభిమానులను, పార్టీ శ్రేణులను కోరారు. రేవంత్ రెడ్డి టార్గెట్ తనపైనే ఉంటుందని ముందే గ్రహించిన హరీశ్ రావు, కేడర్‌ను మానసికంగా సిద్ధం చేసే ప్రయత్నం చేశారు. కేవలం విమర్శలను తిప్పికొట్టడమే కాకుండా, అధికార పార్టీపై ఎదురుదాడికి కూడా హరీశ్ రావు ప్లాన్ చేశారు. సీఎం అయిన తర్వాత రేవంత్ రెడ్డి ఇప్పటివరకు సిద్ధిపేటకు రెండు సార్లు వచ్చినా, ఇక్కడ ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. రేపు మరోసారి సీఎం వస్తే ఈ హామీల అమలుపై గట్టిగా నిలదీయాలని తన పార్టీ శ్రేణులకు, ప్రజలకు హరీశ్ రావు పిలుపునిచ్చారుమొత్తానికి, సీఎం రేవంత్ రెడ్డి రాకముందే సిద్ధిపేట వేదికగా హరీశ్ రావు రాజకీయ పావులు కదపడం, తనపై జరిగే దాడిని తిప్పకొట్టేందుకు ముందస్తు వ్యూహాలు రచించడం ఆసక్తికరంగా మారింది. సిరిసిల్లలో ఎదురైన పరిణామాల నుంచి గుణపాఠం నేర్చుకున్న బీఆర్ఎస్ నేతలు, సిద్ధిపేటలో ఎలాంటి వ్యూహాత్మక తప్పిదాలకు తావులేకుండా పకడ్బందీగా వ్యవహరిస్తున్నారు.

రాబోయే రోజుల్లో సిద్ధిపేట వేదికగా అధికార, ప్రతిపక్షాల మధ్య మరింత తీవ్రస్థాయిలో మాటల యుద్ధం జరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

# ఓటు నమోదుకు మరో అవకాశం..
# సీఈవో సుదర్శన్ రెడ్డి కీలక ప్రకటన




హైదరాబాద్, అక్టోబర్ 14, :తెలంగాణలో కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా సవరణ కోసం ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా అర్హత సాధించిన వారు, ముసాయిదా జాబితాలో పేర్లు లేని వారి కోసం ప్రత్యేక క్యాంప్‌లను ఏర్పాటు చేస్తున్నట్లుగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈనెల 15, 16 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లుగా పేర్కొన్నారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువ ఓటర్లు ఈ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకుని ఫారమ్-6 దరఖాస్తును సమర్పించి తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సీఈవో సూచించారు. అదేవిధంగా, ప్రస్తుతం విడుదల చేసిన డ్రాఫ్ట్ జాబితాలో ఎవరి పేరు కనిపించకపోయినా, జాబితాలో పేరు లేనివారు వెంటనే ఫారమ్-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ స్పెషల్ క్యాంప్‌ల ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారందరి పేర్లను వచ్చే నవంబర్ 9న విడుదల చేయబోయే తుది ఓటర్ల జాబితాలో చేర్చనున్నట్లుగా సీఈవో సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. ఈ సదావకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు

## నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ వ్యవస్థాపకులు ఏవీఎస్ రాజు మృతి పట్ల
## సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సంతాపం

పారిశ్రామికవేత్తగా, సమాజ సేవకుడిగా రాజు సేవలు చిరస్మరణీయం అన్న చంద్రబాబునిర్మాణ రంగంతో పాటు సాహిత్యంలోనూ రాజు తనదైన ముద్ర వేశారన్న లోకేశ్‌ప్రముఖ నిర్మాణ సంస్థ నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎన్‌సీసీ) వ్యవస్థాపకులు, ఛైర్మన్, పద్మశ్రీ డాక్టర్ అల్లూరి వెంకట సత్యనారాయణ రాజు (ఏవీఎస్ రాజు) కన్నుమూశారు. ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఏవీఎస్ రాజు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఏవీఎస్ రాజు మరణంపై సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేస్తూ.. డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ జిల్లా అంతర్వేదిపాలెంలో జన్మించి, ఎన్‌సీసీ సంస్థను స్థాపించి ఉన్నత శిఖరాలకు చేర్చిన దార్శనిక పారిశ్రామికవేత్త అని కొనియాడారు. నిబద్ధత, నిజాయతీతో దేశ నిర్మాణానికి, అభివృద్ధికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని, స్ఫూర్తిమంతమని పేర్కొన్నారు. కేవలం పారిశ్రామికవేత్తగానే కాకుండా ఎన్‌సీసీ ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో పేదలకు అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి వంటి ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఏవీఎస్ రాజు ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ కూడా ఏవీఎస్ రాజు మృతికి సంతాపం తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్మాణ రంగంలో ఎన్‌సీసీ సంస్థకు గొప్ప పేరు ప్రఖ్యాతులు తీసుకురావడంలో రాజు గారి కృషి ఎనలేనిదని అన్నారు. ఆయన కేవలం పారిశ్రామికవేత్త మాత్రమే కాదని, గొప్ప పద్య రచయితగా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారని గుర్తుచేశారు. వివిధ రంగాల్లో ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తించే భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో గౌరవించిందని లోకేశ్ వివరించారు.

దశాబ్దాలుగా ఎన్‌సీసీ సంస్థ ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన మహనీయుడని కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు. ఏవీఎస్ రాజు కేవలం ఒక వ్యాపారవేత్తగానే కాకుండా బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు. నిర్మాణ రంగంలో తనదైన ముద్ర వేస్తూనే, సాహిత్య రంగంలోనూ రాణించారు. మరోవైపు సామాజిక బాధ్యతతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. ఆయన మరణం పారిశ్రామిక, సేవా రంగాలకు తీరని లోటని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## రామచంద్రపురం బీసీ జనరల్, మండపేట జనరల్..
## రెండు మున్సిపాలిటీల్లో మారిన రాజకీయ లెక్కలు

రామచంద్రపురం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజకీయాల్లో చారిత్రక ప్రాంతాలైన రామచంద్రపురం, మండపేట ప్రస్తుతం మళ్లీ హాట్ టాపిక్ గా మారాయి. గత ఉమ్మడి రామచంద్రపురం డివిజన్ పరిధిలో ఉన్న ఈ రెండు నియోజకవర్గాలు రెవెన్యూ పరంగా విడిపోయినా, ఎన్నికల పరంగా పార్లమెంట్ పరిధి మాత్రం ఇప్పటికీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పార్లమెంట్ పరిధిలోనే కొనసాగుతున్నాయి. పరిపాలనా సౌలభ్యం కోసం రామచంద్రపురం కోనసీమ జిల్లాలోకి, మండపేట తూర్పుగోదావరి జిల్లాలోకి వెళ్లినా రాజకీయంగా మాత్రం రెండూ ఒకే రాజకీయ పందాలో సాగుతున్నాయి. తాజాగా రామచంద్రపురం మున్సిపాలిటీ బీసీ జనరల్ గా, మండపేట మున్సిపాలిటీ జనరల్ గా ప్రకటించడంతో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ముఖ్యంగా రామచంద్రపురంలో గత 30 ఏళ్లుగా బీసీ చైర్మన్ లేకపోవడం, ఇప్పుడు బీసీ జనరల్ రావడంతో బీసీ వర్గాల్లో చైర్మన్ గా పోటీ చేసేందుకు అవకాశాలు తమకే ఉన్నాయని ఆశావహుల్లో ఆశలు చిగురించాయి. మండపేట జనరల్ కావడంతో అక్కడ అన్ని వర్గాల నేతలు పోటీపై కన్నేశారు. గతం నుంచి రామచంద్రపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యేలుగా గెలిచి, ఏపీ రాష్ట్ర రిజర్వేషన్ ప్రకారం శెట్టిబలిజ వర్గానికి చెందిన నేతలు మంత్రి పదవులు కూడా పొందారు. అయితే జనసేన నుంచి బీసీ వర్గానికి సంబంధించిన వ్యక్తిని చైర్మన్ గా అనౌన్స్ చేస్తే బాగుంటుందని జనసైనికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### దీక్ష తీసుకున్న 60 మంది భవానీలు

మహబూబాద్ పట్టణ కేంద్రంలోని భీష్మ యూత్ (పట్టణ గంగపుత్ర సంఘం) ఆధ్వర్యంలో 18వ శ్రీ దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భాగంగా ఈ సంవత్సరం 60 మంది భవానీలు దీక్ష తీసుకోవడం జరిగింది ఉదయం సాయంత్రం పూజా కార్యక్రమం జరుగుతున్నాయి సందీప్ శాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది . ఈ కార్యక్రమంలో గురు భవాని స్వామిదేశాబోయిన విజయ్. భవానులు అవారి అనిల్, డోలి కృష్ణ, చుక్కల శ్రీనివాస్, డోలి ఉపేష్, దేశాబోయిన శ్రీనివాస్, కాపారబోయిన సురేష్, గుండాల శీను, దేశాబోయిన అనిల్, చుక్కల నరేష్, ఆంకాల శ్రీకాంత్, సునీల్, సాయి రవి, శీను, సాంబశివరావు, పద్మ ఉమా, తదితరు భవానులుపాల్గొన్నారు

### సాగునీటి కోసం రెండు గ్రామాల మధ్య ఘర్షణ

వనపర్తి కొల్లాపూర్ నియోజకవర్గంలో సాగునీటి కోసం రెండు గ్రామాల మధ్య ఘర్షణ నెలకొంది. పాన్‌గల్ మండలంలో ప్రవహిస్తున్న బీమా కాల్వకు జూరాల ప్రాజెక్టు ద్వారా నీరు ప్రవహిస్తుండగా, ఆ నీటి పంపిణీ వ్యవహారంలో మహమ్మదాపూర్, బుసిరెడ్డిపల్లి గ్రామాల రైతులు గొడవకు దిగారు. విషయం తెలిసి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసుల ముందే రైతులు ఒకరినొకరు పిడి గుద్దులు గుద్దుకుంటూ ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు.

# ధరల మంట..
# కోరలు చాస్తోన్న ఆహార ద్రవ్యోల్బణం

హైదరాబాద్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలతో దేశంలో అడ్డూఅదుపూ లేకుండా పెరుగుతున్న ధరలు కోట్లాదిమంది ప్రజల కష్టార్జితాన్ని, పొదుపును హరించి వేస్తున్నాయి. నిరంతర ద్రవ్యోల్బణం ద్వారా ప్రభుత్వాలు ప్రజల సంపదలో గణనీయమైన భాగాన్ని వారికి తెలియకుండానే హరించగలవు అని వందేళ్ల కిందటే ప్రఖ్యాత ఆర్థికవేత్త కీన్స్ చేసిన హెచ్చరిక నేటి పరిస్థితులకూ సరిపడుతోంది. జాతీయ గణాంక సంస్థ (ఎన్‌ఎస్‌ఒ) విడుదల చేసిన నివేదిక ప్రకారమే... ఆహార పదార్థాలు, ఇంధన సంబంధిత రవాణా వ్యయాలు పెరగడంతో రెండేళ్ల గరిష్టానికి చిల్లర ద్రవ్యోల్బణం పెరిగిపోయింది. ఆగస్టులో 4.83 శాతంగా నమోదైన వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ఆధారిత ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో అమాంతంగా 5.54 శాతానికి పెరిగింది. 2024 అక్టోబర్‌లో నమోదైన 6.21 శాతం తరువాత ఇదే అత్యధిక స్థాయి. ఈ ఏడాది అక్టోబర్‌లో 6 శాతం పైనే అన్న అంచనాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. వరుసగా నాలుగు నెలలుగా ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఆహార ద్రవ్యోల్బణం కోరలు చాస్తోంది. ఆగస్టులో 5.97 శాతం నుంచి 7.74 శాతానికి ఎగబాకింది. ఎన్నడూ లేనంతగా... ఉల్లి ద్రవ్యోల్బణం ఏకంగా 108.09 శాతం, బియ్యం 40 శాతం, పంచదార 30 శాతం పెరిగాయి. దేశంలో పనిచేసే వారిలో 94 శాతం అసంఘటిత రంగంలోనే ఉన్నారు. వారి కొనుగోలు శక్తి రోజురోజుకూ క్ష?ణిస్తోంది. ఆదాయమంతా ఆహారం, అద్దె, రవాణా తదితర అవసరాలకే సరిపోతోంది. పిల్లలకు నాణ్యమైన విద్య, కుటుంబ సభ్యుల ఆరోగ్యం, మందులు వంటి విషయాల్లో రాజీ పడాల్సి వస్తోంది. పొదుపు సంగతే మరిచిపోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్న దుస్థితి. దేశంలో గ్రామీణ ద్రవ్యోల్బణం 6.08 శాతానికి ఎగబాకితే, రాష్టంలో 6.29 శాతానికి పెరిగింది. రాబోయే మూడు నెలల్లో పండగలు రానుండటంతో ద్రవ్యోల్బణం ఆకాశాన్నంటే పరిస్థితి. రాష్ట్రం 15 శాతం అభివృద్ధిలో ముందుకు పోతోందని ముఖ్యమంత్రి చెబుతుంటే ద్రవ్యోల్బణం దేశ సగటుకన్నా ఎక్కువగా పెరగడం గమనార్హం.

పశ్చిమాసియా సంక్ష?భం నేపథ్యంలో ఎరువులు, పురుగుమందులు, వంట నూనెలు, పప్పుల దిగుమతులు తగ్గిపోయి, ధరలు భారీగా పెరిగాయి. ఇంధన దిగుమతులను తగ్గించుకునే పేరుతో ఇథనాల్‌ను పెట్రోలులో కలిపేందుకు కేంద్రం అనాలోచితంగా తీసుకున్న నిర్ణయాలు ఆహార ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోశాయి. ఇ 20 పేరుతో బియ్యం, మొక్కజొన్న, చెరకును విచ్చలవిడిగా ఇథనాల్ తయారీకి వినియోగిస్తోంది. గత ఏడాది 32 లక్షల టన్నుల బియ్యాన్ని వినియోగిస్తే, ఈ ఏడాది జూన్ 30 నాటికే 42 లక్షల టన్నుల బియ్యాన్ని ప్రైవేటు డిస్టిలరీలకు కేటాయించారు. రూ.10 వేల కోట్లకు పైగా ప్రజల సొమ్మును రాయితీగా కట్టబెట్టారు. ఈ చర్యల వల్ల ఆహారం, పశుదాణా, నీటి వనరులు, సాగుభూములపై తీవ్ర ప్రభావం పడుతోందని ఎందరో మేధావులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల ఇదే అంశాన్ని అంచనా వేసి, తగు చర్యలు తీసుకోవాలని ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత్ నాగేశ్వరన్ ఇచ్చిన సలహాను సైతం కేంద్రం పెడచెవిన పెట్టింది. ఏటా ఇతర దేశాలకు కోటి 20 లక్షల టన్నుల పంచదారను ఎగుమతి చేసే మన దేశం ఇప్పుడు భారీగా దిగుమతులపై ఆధారపడుతోంది. ఈ పరిణామాలు, ఎల్‌నినో ప్రభావంతో కోటి టన్నులకుపైగా బియ్యం ఉత్పత్తి తగ్గిపోయింది. నెల రోజుల వ్యవధిలోనే కిలోకు రూ.20 నుంచి రూ.40 వరకూ ధరలు పెరిగిపోయాయి. మొక్కజొన్న ఇథనాల్‌కు మళ్లడంతో పౌల్ట్రీ ఉత్పత్తుల, పాల ధరలు భారీగా పెరిగి సామాన్యుడు పౌష్టికాహారానికి దూరమవుతున్నాడు. మోడీ ప్రధాని అయ్యేనాటికంటే తక్కువగా అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన ధరలు ఉన్నా సామాన్యుడిపై మోపిన భారం అన్ని ధరల పెరుగుదలనూ మరింత తీవ్రం చేసింది. ఈ ఏడాది కాలంలో రూపాయి 7.5 శాతం పతనమైంది. 30 బిలియన్ టన్నుల విదేశీ మారక నిల్వలు స్టాక్ మార్కెట్ నుంచి పలాయనం చిత్తగించాయి. ఆర్‌బిఐ వడ్డీ రేట్లు పెంచడం సామాన్యులకు ఇఎంఐలను భారం చేసింది మినహా ఎఫ్‌డిఐలను ఆపలేకపోయింది. ఇప్పటికే పప్పు దినుసుల దిగుమతులు 60 శాతానికి ఎగబాకాయి. ఇంధన దిగుమతులు మోడీ ఏలుబడిలో 77 శాతం నుంచి 89 శాతానికి పెరిగిపోయాయి. ఉపాధి హామీ చట్టాన్ని వి.బి గ్రామ్ జి పథకంగా మార్చడం, ఇతర మార్పులతో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పనిదినాలు 23.2 శాతం తగ్గిపోయాయి. ఒక్కో కుటుంబానికి సగటు వార్షిక ఆదాయం రూ.13,190 నుంచి రూ.11,616కి పడిపోయింది. ఉపాధి హామీ నుంచి వచ్చే అరకొర ఆదాయం కూడా తగ్గడం, ఉపాధి అవకాశాలు కుంచించుకుపోవడంతో గ్రామీణ కుటుంబాల జీవనం తల్లకిందులైంది. ద్రవ్యోల్బణాన్ని గణాంకాలుగా కాకుండా కోట్లాది కుటుంబాల జీవన సమస్యగా గుర్తించి, కట్టడి చేయాలి.

## వల్లూరు నార్సింగ్ జాతీయ రహదారిపై లారీ బోల్తా

**రెండు కిలోమీటర్ల మేర భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్**

**తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు**

మెదక్ జిల్లా వల్లూరు నార్సింగి జాతీయ రహదారిపై ఒక లారీ బోల్తా పడింది. దాంతో రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ ఆగిపోయింది. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారు. ట్రాఫిక్ నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా, జాతీయ రహదారుల శాఖ అధికారులు ఇంకా సహాయక చర్యలు ప్రారంభించలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేసారు.

## నూతన వధూవరులకు మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు ఆశీర్వాదం.

**షర్మిల,నవీన్ ల వివాహ వేడుకకు హాజరై అక్షింతలు వేసి దీవెనలు.**

**హైదరాబాదులో ఘనంగా జరిగిన షర్మిల,నవీన్ ల వివాహ వేడుక**

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 14:** తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు అన్నారుగూడెం గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ అన్నయ్య కూతురు గొడ్ల రవి నాగేంద్ర దంపతుల ప్రథమ కుమార్తె వివాహ వేడుకకు బుధవారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. షర్మిల వివాహం రంగారెడ్డి జిల్లాకు చెందిన నవీన్‌తో బుధవారం కందుకూరు మండలంలోని టంకం రామ్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల సమక్షంలో వైభవంగా జరిగింది.



ఈ వివాహ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు నూతన వధూవరులు షర్మిల,నవీన్‌లకు అక్షింతలు వేసి,వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి,వివాహ వేడుకలో పాల్గొని సందడి చేశారు.

ఈ కార్యక్రమంలో అన్నారుగూడెం గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్,ఉపసర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు,వార్డు సభ్యులు సూదా హనుమంతరావు, సర్పంచ్ సతీమణి జ్యోతి,నాయకులు మారెళ్ల దేవేందర్,గొడ్ల సాల్మన్,ప్రసన్న కుమార్,రంజిత్ కుమార్ తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## మహిళలకు ఇబ్బంది లేకుండా ఎల్ఈడి లైట్లు.

కమాన్ పూర్ బతుకమ్మలు ఆడే మహిళలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందని జూలపల్లి సర్పంచ్ పోల్ దాసరి వనిత- సాయికుమార్ తెలిపారు.కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో బతుకమ్మ పండుగ వీధి దీపాల వెలుగుల మధ్యన జరుపుకోవాలని జూలపల్లి సర్పంచ్ పోలుదాసరి వనిత సాయికుమార్ గారి ఆధ్వర్యంలో12,13 వార్డులలో ఎల్ఈడి వీధి దీపాలు పెట్టించడం తోపాటుమరియు గ్రామంలో బతుకమ్మ ఆడే ప్రతి చోట ఆడపడుచులకు ఇబ్బంది కలగకుండా వెలుగుల మధ్య బతుకమ్మ ఆడుకోవడానికి వీలుగా150,100 ఐమాక్స్ ఎల్ఈడి లైట్లు పెట్టించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం రాజమహేందర్ వార్డు సభ్యులు సోప్పరిసంతోష్ కుమార్ బండి శంకర్ గ్రామపంచాయతీ సిబ్బంది కారోబార్ బర్ల భూమయ్య ఎలక్ట్రిషన్ శేఖర్ పాల్గొనడం జరిగింది

# ఎన్నికల ముందు ఇరాన్‌పై దాడి?..
# ట్రంప్, నెతన్యాహూ మధ్య రహస్య చర్చలు



ఎన్నికలముందుఇరాన్‌పైసైనిక చర్యకు ట్రంప్, నెతన్యాహు చర్చలుఇరాన్ అణు కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తోందని నెతన్యాహు ఆందోళన

***ముందుకెళ్లండి అని చెప్పి.. సలహాదారులతో మాట్లాడి వెనక్కి తగ్గిన ట్రంప్***

సైనిక చర్యకు అమెరికా రక్షణ మంత్రి మొగ్గు, ఇతర సలహాదారుల వ్యతిరేకతఇరు దేశాల సైనిక బలగాలు అప్రమత్తం, పూర్తిస్థాయిలో సన్నాహాలుఅంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసే కీలక పరిణామం ఒకటి తెరపైకి వచ్చింది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాల్లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇరాన్‌పై కొత్తగా సైనిక చర్య చేపట్టే అంశంపై ఇరు దేశాల నేతలు చర్చించినట్లు విశ్వసనీయ వర్గాల కథనాలు వెల్లడిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు మధ్య గత వారం ఈ కీలక సంభాషణలు జరిగినట్లు పలువురు అధికారులు తెలిపారు. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలను కమ్ముకునేలా చేస్తోంది. ఇజ్రాయెల్ నిఘా వర్గాల సమాచారం ప్రకారం, ఇరాన్ తన అణు కార్యక్రమానికి సంబంధించిన కొన్ని భాగాలను పునరుద్ధరించే ప్రయత్నాల్లో ఉందని నెతన్యాహు, ట్రంప్‌కు వివరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 'పికాక్స్ మౌంటెన్' వంటి ప్రదేశాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సైనిక చర్యను పునఃప్రారంభించేందుకు నెతన్యాహు తీవ్ర ఆసక్తి చూపారని, దీనిపై ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని ట్రంప్ ఆయనకు చెప్పినట్లు ఒక అమెరికా అధికారి పేర్కొన్నారు. అయితే, ట్రంప్ దీనిపై ఎటువంటి కచ్చితమైన హామీ ఇవ్వలేదని సమాచారం.మొదట ఈ ఆలోచనకు ట్రంప్ సానుకూలంగా ఉన్నప్పటికీ, తన సలహాదారులతో సంప్రదించిన తర్వాత వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, సెంట్రల్ కమాండ్ నాయకత్వం సైనిక చర్యకు మొగ్గు చూపగా, ట్రంప్ సలహాదారుల్లో మెజారిటీ సభ్యులు మాత్రం ప్రస్తుతానికి ఆర్థిక ఆంక్షల ఒత్తిడిని కొనసాగించడమే మేలని సూచించినట్లు సమాచారం. అమెరికా మధ్యంతర ఎన్నికలకు ముందు ఇరాన్‌పై దాడి చేయబోమని ట్రంప్ బహిరంగంగా ప్రకటించడానికి ముందే ఈ చర్చలు జరగడం గమనార్హం.

# ఢిల్లీ సోనియా విహార్‌లో 34 ఏళ్ల వ్యక్తి దారుణ హత్య

**బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు కాల్పులు జరిపి పరారీ**

**ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన మనీశ్ యాదవ్**

ఢిల్లీ దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. సోనియా విహార్ ప్రాంతంలో మంగళవారం రాత్రి ఇద్దరు దుండగులు జరిపిన కాల్పుల్లో మనీశ్ యాదవ్ (34) అనే వ్యక్తి దారుణంగా హత్యకు గురయ్యాడు. ఘటన వివరాల్లోకి వెళ్తే.. సోనియా విహార్‌లోని 4.5 పుష్తా సర్వీస్ రోడ్డులో నివాసముంటున్న మనీశ్ యాదవ్‌పై మంగళవారం రాత్రి 9:13 గంటల సమయంలో దుండగులు దాడికి తెగబడ్డారు. హెల్మెట్లు ధరించి బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అతడిపై కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన మనీశ్‌ను కుటుంబ సభ్యులు వెంటనే సివిల్ లైన్స్‌లోని ఎయిమ్స్ శుశ్రుత ట్రామా సెంటర్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై సోనియా విహార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. భారతీయ న్యాయ సంహిత, ఆర్మ్స్ యాక్ట్ కింద పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఫోరెన్సిక్ బృందాలు ఘటనా స్థలాన్ని పరిశీలించి కీలక ఆధారాలు సేకరించాయి. నిందితులను పట్టుకునేం దుకు పలు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులకు సంబంధించి తమ వద్ద కీలక ఆధారాలు ఉన్నాయని, త్వరలోనే వారిని అరెస్టు చేస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేశారు. కాగా, ఢిల్లీలో ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్న ఇటువంటి వరుస కాల్పుల ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నెల5నభిఖం సింగ్ కాలనీలో జరిగిన కాల్పుల ఘటన తర్వాత, మళ్లీ ఇప్పుడు అలాంటిదే మరోఉదంతంవెలుగులోకిరావడం గమనార్హం

# జేఎన్‌టీయూ వీసీ భార్య ఆరోపణలు అవాస్తవం
# ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



హైదరాబాద్ జేఎన్‌టీయూ వీసీ కిషన్‌కుమార్ రెడ్డి భార్య సుజనా రెడ్డి తనపై చేసిన ఫిర్యాదు, ఆరోపణలు అవాస్తమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఖండించారు. గత నెల 8వ తేదీన పోలీస్ స్టేషన్‌లో తనను తిట్టినట్లు, బెదిరించినట్లు సుజనా రెడ్డి చేసిన ఫిర్యాదులోని ఆరోపణలు అవాస్తవమని స్పష్టం చేశారు. ఆమె ఎవరో కూడా తనకు తెలియదని, ఆమెను ఎప్పుడూ చూడలేదని వివరణ ఇచ్చారు.

నేను తాను జేఎన్‌టీయూ వీసీకి ఫోన్ చేసినప్పుడు, వీసీ బాత్‌రూమ్‌లో ఉన్నారని ఎవరో ఫోన్ ఎత్తి చెప్పారని తెలిపారు. ఏదైనా విషయం ఉంటే చెప్పాలని వారు అనడంతో, తాను వీసీతోనే మాట్లాడతానని చెప్పి ఫోన్ పెట్టేశానని వెల్లడించారు.

ఆ తర్వాత వీసీతో మాట్లాడానని, సీనియర్ ప్రొఫెసర్లను, ముఖ్యంగా మహిళా ప్రొఫెసర్లను దూషించడానికి కారణాలేమిటని ప్రశ్నించానని తెలిపారు. తనపై ఏదైనా కోపం ఉంటే తనను ప్రశ్నించవచ్చని, అంతేకానీ మహిళా ప్రొఫెసర్లను ఎందుకు దూషించారని వీసీని అడిగినట్లు తెలిపారు. దీనికి వీసీ తప్పు జరిగిందని అంగీకరిస్తూ క్షమాపణ కోరారని, తాను తిరుపతి నుంచి తిరిగి వచ్చిన తర్వాత లేఖ ఇస్తానని చెప్పారని పేర్కొన్నారు. మరుసటి రోజు సాయంత్రం వరకు ఆ లేఖ రాకపోవడంతో మహిళా ప్రొఫెసర్లు పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారని తెలిపారు.దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ జేఎన్‌టీయూ..ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థు లు ఈ సంస్థలో విద్యనభ్యసిం చి తమ జీవితాల్లో ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారు. ఇలాంటి ప్రతిష్ఠాత్మక సంస్థకు తమ కళాశాలలు కూడా అనుబంధంగా కొనసాగుతున్నాయి.

ఆ ఫిర్యాదుకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు సరిగా అందించకుండా, తన భార్యతో తనపై ఫిర్యాదు చేయించారని ఆరోపించారు. తక్షణమే మహిళా ప్రొఫెసర్ల పట్ల తాను వ్యవహరించిన తీరుపై వీసీ వెంటనే క్షమాపణలు తెలియజేయాలి. వీసీ భార్య ప్రతి పనిలో జోక్యం లేకుండా యూనివర్సిటీని నడిపించేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. మహిళా ప్రొఫెసర్లతో వీసీ దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలపై నిజానిజాలు తేల్చేందుకు సంబంధిత సీసీటీవీ ఫుటేజీని కూడా పోలీసులు పరిశీలించాలని అయన కోరారు.

# పోలీసు నిర్బంధంలో కాంగ్రెస్ నాయకురాలు సుంకర పద్మశ్రీ

కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీని పోలీసులు ఇంటి వద్ద అడ్డుకున్నారు. ఎయిర్పోర్ట్ నిర్వాసితుల కొరకు సుంకర పద్మశ్రీ బిక్షటన తలపెట్టి ఇంటి నుండి జోలి పట్టుకుని బయలుదేరారు. ..

రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ఎటువంటి అనుమతులు లేవంటూ పోలీసులు ఇంటి ఆవరణంలోనే పద్మశ్రీని నిలిపివేశారు.

ఎయిర్పోర్ట్ నిర్వాసితుల కొరకు పేద ప్రజలకు న్యాయం చేసే ఉద్దేశంతో చేసే నిరసనను ఆపు చేయించి, ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా నన్ను నిర్బంధించడం సమంజసమా అని పద్మశ్రీ పోలీసులను నిలదీసారు.ఇప్పటికే ఏర్పోర్ట్ నిర్వాసితులను గన్నవరం వద్ద అదుపులో తీసుకుని ఎటువంటి సమాచారం లేకుండా జీపులో తీసుకువెళ్లారని పద్మశ్రీ మండిపడ్డారు.,. ఈరోజు గన్నవరం ఎయిర్పోర్ట్ కు వచ్చి రాష్ట్రపతికి వంగి వంగి దండాలు పెట్టే ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి హోంమంత్రి బిజెపి పెద్దలు మీరు నుంచున్న నేల పేద ప్రజలు ఇచ్చిన భూమితోనే నిర్మించిన ఎయిర్పోర్ట్ అని గుర్తుంచుకోండని అమె అన్నారు.

# ఈరవత్రికి గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని పద్మశాలి

## పద్మశాలి సంఘం ఎల్బీనగర్ సర్కిల్ అధ్యక్షులు వున్న గణేష్ నేత విజ్ఞప్తి



హైద్రాబాద్ అక్టోబర్ 14:తెలంగాణలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, చేనేత కార్మికుల సంక్షేమం, గల్ఫ్ శ్రామికుల హక్కుల కోసం దశాబ్దాలుగా నిస్వార్ధంగా పోరాడుతున్న ప్రజానేత, మాజీ ఎమ్మెల్యే అనిల్ ఈరవత్రికి గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని పద్మశాలి సంఘాలు, సమస్త బీసీ సంఘాల తరపున ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కి, కాంగ్రెస్ అధిష్టానానికి పద్మశాలి సంఘం ఎల్బీనగర్ సర్కిల్ అధ్యక్షులు వున్న గణేష్ నేత విజ్ఞప్తిచేశారు.బుధవారం బషీర్ బాగ్ ప్రెస్



క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లోప్రధాన కార్యదర్శి గడ్డం లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం శ్రావణ్, కౌకుంట్ల రవితేజజెల్ల జగన్నాథం, గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు కత్తుల సుదర్శన్తడకయాదగిరి ,చెరుపల్లి ప్రభాకర్ , చిక్క చంద్రమోహన్ , మ్యాకం గోపాల్, కర్ణాటి విజయ్, గజం జగదీష్ లతో కలిసి మాట్లాడారు.

రాజ్యాంగ నిబంధనల ప్రకారం గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా నియమించబడే వ్యక్తికి సహకార రంగం, ప్రజాసేవ, కార్మిక సంక్షేమ రంగాలలో విశేషమైన అనుభవం, సేవ ఉండాలి. ఈ అర్హతలన్నింటికీ తిరుగులేని నిదర్శనం అనిల్ ఈరవత్రికి ఉన్నాయని తెలిపారు.

అనిల్ ఈరవత్రి గారికి మద్దతు ఎందుకు?

గత దీ=ా పార్టీ పదేళ్ల పాలనలో చేనేత ప్రాథమిక సహకార సంఘాల ఎన్నికలను పూర్తిగా పక్కనబెట్టి, సహకార వ్యవస్థను నిర్వీర్యం చేశారు. ప్రజా ప్రభుత్వం రాగానే స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేలా నిరంతరం కృషి చేసింది అనిల్ ఈరవత్రి అని తెలిపారు.అంతే కాకుండా

అఖిల భారత పద్మశాలి మహాసభలను అత్యంత ఘనంగా నిర్వహించి, ముఖ్యమంత్రి ని స్వయంగా రప్పించి నేతన్నల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన ప్రధాన పాత్ర పోషించారు.

ఇప్పటివరకు ముఖ్యమంత్రులు పద్మశాలి మహా సభలకు వచ్చిన దాకలాలు లేవు అనిల్ ఈరవత్రి

పట్టుదల వల్లే మార్చ్ 09 2025 న జరిగిన పద్మశాలి మహా సభలో మన ముఖ్యమంత్రి రేవంత్రెడ్డిపాల్గొన్నారన్నారు.ఆ ఫలితంగానే గత BRS ప్రభుత్వం లో చేయలేనటువంటి చేనేత రుణమాఫీ, బకాయిలు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రూ. 49 కోట్ల చేనేత రుణమాఫీ అమల్లోకి వచ్చింది. నిలిచిపోయిన రూ. 290 కోట్ల 'చేనేత చేయూత' బకాయిల విడుదల సాధ్యమైంది.

ఈ నిర్ణయాలు అమలై వేలాది నేతన్నల ఇళ్లలో వెలుగులు నిండటంలో అనిల్ ఈరవత్రిగారు చేసిన నిరంతర సంప్రదింపులే మూలకారణమన్నారు.

జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్ గ్రేషియా మంజూరు చేయించడంలో అనిల్ గారు కీలక భూమిక పోషించారు. గల్ఫ్ కార్మికుల కష్టాలను గత BRS ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ఇటువంటి పాలసీ దేశంలో ఎక్కడ అమలులో లేదు. సిరిసిల్ల సభలో స్వయంగా గౌరవ ముఖ్యమంత్రి గారే బహిరంగంగా పేర్కొంటూ– "గల్ఫ్ కార్మికుల కష్టాలను గుర్తించి, వారి సంక్షేమం కోసం ఒక బలమైన విధానం రావడంలో అనిల్ ఈరవత్రి పాత్ర అత్యంత కీలకమైనది" అని కొనియాడారు.

తెలంగాణలో ఎక్కడ బడుగు, బలహీన వర్గాలపై అన్యాయం జరిగినా మొదటి వరుసలో నిలిచే నాయకుడు ఆయన. చట్టసభలలో మాట్లాడే అపారమైన అనుభవం, సంక్షేమ పథకాలు, నిధులు సాధించిన స్పష్టమైన ట్రాక్ రికార్డు ఆయనకున్నదని తెలిపారు.

# శ్రీ మైసమ్మ దేవి ఆలయంలో అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు






హైద్రాబాద్ అక్టోబర్ 14;అంబరుపేటలోని జైస్వాల్ గార్డెన్‌లో గల శ్రీ శ్రీ శ్రీ మైసమ్మ దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం నుండి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, కుంకుమార్చనలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో బుధవారం అన్నప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమం లో అంబర్‌పేట్ మాజీ కార్పొరేటర్ పద్మా వెంకట్ రెడ్డి, గోల్నాక మాజీ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, అంబర్‌పేట్ అడిషనల్ డి.సి.పి. నర్సయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు చెరుకు యాదవరెడ్డి, ప్రధాన కార్యదర్శి సి.హెచ్. ఇంద్రసేన్ యాదవ్, చైర్మన్ ఎన్. రమేష్ గౌడ్, ఉపాధ్యక్షులు కె. దిలీప్ గౌడ్, కోశాధికారి పి. వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

### తాండూర్ 12వ వార్డులో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన గ్రామ సర్పంచ్ ముడిమడుగుల సురేష్

తాండూర్ మంచిర్యాల జిల్లా తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని 12వ వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు అడుగులు పడ్డాయి. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట్ స్వామి సహకారంతో, డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం గ్రామ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ ప్రారంభించారు.గ్రామంలోని వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజల రాకపోకలకు సౌకర్యవంతంగా ఉండటంతో పాటు రహదారి సమస్యలు తగ్గనున్నాయి. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండీ ఈసా, వార్డు సభ్యులు రెండ్ల శిరీష?అశోక్, కాంగ్రెస్ నాయకులు భాస్కర్ గౌడ్, కంపెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు సైతం కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆసుపత్రులలో మెరుగైన భద్రత అవసరం

## సి.హెచ్. ప్రతాప్

ప్రాణాలు కాపాడాల్సిన ఆసుపత్రిలోనే ఐదుగురు పసికందులు అగ్నిప్రమాదానికి బలికావడం అత్యంత విషాదకరం. ఆదిలాబాద్‌లోని రాజీవ్‌గాంధీ వైద్య విజ్ఞాన సంస్థ (రిమ్స్)లో సెప్టెంబర్ 21న జరిగిన అగ్నిప్రమాదంపై విచారణ కమిటీ వెల్లడించినట్లు ప్రచారంలోకి వచ్చిన అంశాలు ఆసుపత్రుల భద్రతా వ్యవస్థలను మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి. చిన్నపాటి సాంకేతిక లోపం కూడా ఎంతటి ప్రాణనష్టానికి దారితీస్తుందో ఈ ఘటన తెలియజేస్తోంది.

ప్రమాద సమయంలో ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగంలో 27 మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారు. ఎయిర్‌కండిషనర్‌లో మంటలు చెలరేగడంతో వార్డంతా దట్టమైన పొగ వ్యాపించింది. ఐదుగురు శిశువులు ప్రాణాలు కోల్పోయారు. మిగిలిన చిన్నారులను వైద్యసిబ్బంది ఇతర ఆసుపత్రులకు తరలించారు. అనంతరం చికిత్స పొందుతున్న 18 మంది శిశువులు కోలుకొని డిశ్చార్జ్ అయ్యారని జిల్లా కలెక్టర్ వెల్లడించడం ఊరటనిచ్చే విషయం.

ఆరుగురు సభ్యుల విచారణ కమిటీ సమర్పించిన 50 పేజీల నివేదికలో ఎలుకలు ఎయిర్‌కండిషనర్ విద్యుత్ తీగలను కొరకడం వల్ల షార్ట్‌సర్క్యూట్ సంభవించినట్లు పేర్కొన్నారని వార్తలు వెల్లడించాయి. విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో లోపాలు, అగ్నిప్రమాద హెచ్చరిక వ్యవస్థ లేకపోవడం, ఎయిర్‌కండిషనర్లకు క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయకపోవడం వంటి అంశాలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ వివరాలు ఆసుపత్రుల్లో ముందస్తు భద్రతా చర్యల ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తున్నాయి.

ఇలాంటి ఘటనల నివారణకు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులన్నింటిలో సమగ్ర భద్రతా తనిఖీలు చేపట్టాలి. ముఖ్యంగా నవజాత శిశు సంరక్షణ విభాగాలు, ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లలో విద్యుత్ తీగలు, ఏసీలు, ఆక్సిజన్ సరఫరా వ్యవస్థలను ప్రత్యేకంగా పరిశీలించాలి. ప్రతి మూడు నెలలకు పరికరాల నిర్వహణ చేపట్టి, ఆ వివరాలను నమోదు చేయాలి. విద్యుత్ తీగలకు రక్షణ కవచాలు ఏర్పాటు చేయడంతోపాటు ఎలుకల నియంత్రణకు శాస్త్రీయ చర్యలు అమలు చేయాలి.

ప్రతి ఆసుపత్రిలో పొగను గుర్తించే అలారాలు, అగ్నిమాపక పరికరాలు, అత్యవసర విద్యుత్ సరఫరా, సురక్షిత నిష్క్రమణ మార్గాలు తప్పనిసరిగా ఉండాలి. అగ్నిప్రమాదం సంభవించినప్పుడు శిశువులు, వెంటిలేటర్లపై ఉన్న రోగులను సురక్షితంగా తరలించే విధానాలపై వైద్యసిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. క్రమం తప్పకుండా మాక్‌డ్రిల్స్ నిర్వహించాలి.

ఆసుపత్రులలో సాంకేతిక నిపుణులను తగిన సంఖ్యలో నియమించడం, పాత విద్యుత్ వ్యవస్థలను ఆధునీకరించడం, వార్డుల్లో సరైన గాలి ప్రసరణ కల్పించడం అత్యవసరం. ప్రతి ఆసుపత్రికి ప్రత్యేక భద్రతా కమిటీని ఏర్పాటు చేసి, లోపాల పరిష్కారాన్ని నిరంతరం పర్యవేక్షించాలి. ఇందుకోసం ప్రత్యేక నిర్వహణ నిధులు కేటాయించడం అవసరం.

ఆసుపత్రి అంటే రోగికి ప్రాణభరోసా కలిగించే ప్రదేశం. అత్యాధునిక వైద్య పరికరాలతోపాటు సమర్థమైన భద్రతా వ్యవస్థలూ ఉన్నప్పుడే ఆ భరోసా సార్థకమవుతుంది. చికిత్స అందించడం ఎంత ముఖ్యమో, చికిత్స పొందుతున్న ప్రతి ప్రాణాన్ని సురక్షితంగా కాపాడడం అంతకంటే ముఖ్యమని ఆదిలాబాద్ విషాదం గుర్తుచేస్తోంది.

# కోర్టు ఆవరణలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

## పూల పండుగలో భక్తి పారవశ్యం..

## ఆటపాటలతో మహిళా న్యాయవాదుల సందడి



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 14-10-2010** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను వేములవాడ కోర్టు ఆవరణలో బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ప్రకృతిని పూల రూపంలో ఆరాధిస్తూ, అమ్మవారిపై భక్తిశ్రద్ధలను చాటుతూ మహిళా న్యాయవాదులు, కోర్టు మహిళా సిబ్బంది బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల మధ్య కోర్టు ఆవరణ పండుగ శోభను సంతరించుకుంది.ఈ వేడుకలను సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం మహిళా న్యాయవాదులు, కోర్టు మహిళా సిబ్బంది సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను ఏర్పాటు చేసి, చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. పూల పండుగలో భక్తి పారవశ్యం వెల్లివిరియగా, తెలంగాణ ఆడపడుచుల సంప్రదాయాలు, సంస్కృతీ వైభవం ప్రతిబింబించాయి.ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ పూలతో జరుపుకునే ఈ పండుగ మహిళల ఐక్యతకు, భక్తిభావానికి, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు నిదర్శనమని తెలిపారు. తరతరాలుగా వస్తున్న ఇలాంటి పండుగలను గౌరవిస్తూ, భావితరాలకు మన సంస్కృతి సంప్రదాయాలను అందించాలని సూచించారు.బతుకమ్మ వేడుకలతో కోర్టు ఆవరణలో ఆహ్లాదకరమైన పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పిట్టల మనోహర్‌తో పాటు సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# మరిమడ్ల గ్రామ సమగ్ర అభివృద్ధికి పీఎం-అజయ్ పథకం

## ఎస్సీ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాలు



**కోనరావుపేట ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ – 14** కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో ప్రధానమంత్రి అనుసూచిత జాతుల అభ్యుదయ పథకం (పీఎం-అజయ్)లో భాగంగా గ్రామ సమగ్ర అభివృద్ధి, షెడ్యూల్డ్ కులాల ప్రజల ఆర్థిక అభ్యున్నతికి సంబంధించిన కార్యక్రమాలు చేపట్టారు.

షెడ్యూల్డ్ కులాల జనాభా 40 శాతానికి మించి ఉన్న గ్రామాలను ఎంపిక చేసి, వాటిని అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ఎస్సీ వర్గాల ప్రజల పేదరికాన్ని తగ్గించడం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, నైపుణ్య శిక్షణ ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో ఈ పథకాన్ని అమలుచేస్తున్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఎస్సీ వర్గాల ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందని ఈ కార్యక్రమం ద్వారా వివరించారు.ఈ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) స్నిగ్ధ, గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేందర్, స్థానిక సర్పంచ్ కొల స్వాతి శ్రీనివాస్, వార్డు సభ్యులు రమేష్, శేఖర్, మధుకర్, భాస్కర్, అనోక్, నారాయణ, నాయకులు కుమ్మరి దిలీప్ కుమార్, బొల్లం శ్రీనివాస్‌తో పాటు ఇతర అధికారులు చురుగ్గా పాల్గొన్నారు.

### భూ సమస్యలు త్వరగా పరిష్కరించాలి కలెక్టర్ హరిత

ఆసిఫాబాద్, భూ సమస్యలను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు.బుధవారం కౌటాల తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఉద్యోగుల హాజరు, రికార్డు గది, భూభారతి ఫైళ్లను పరిశీలించారు.సిబ్బంది ఎక్కువగా ఉన్నందున దరఖాస్తుల పరిశీలన, విచారణ, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని, రీ సర్వే ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, సర్వేకు ముందే రైతులకు నోటీసులు ఇవ్వాలని సూచించారు.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను 100 శాతం పూర్తి చేయాలని, అర్హులందరి పేర్లు ఉండాలని, మ్యాపింగ్ కాని, అన్మ్యాప్డ్ జాబితాలోని ఓటర్లకు నోటీసులు జారీ చేసి ధృవపత్రాలు స్వీకరించాలని, ఈ నెల 15, 16 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో శిబిరాలు నిర్వహించి ఫారం-6 దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు.కార్యక్రమంలో నాయబ్ తహసిల్దార్ హరిలాల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్టోబర్ 21 నుండి 31 వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు..

## పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 14:**పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు దేశ శాంతిభద్రతలు, ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు.

ఓపెన్ హౌస్ కార్యక్రమాలు

పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించి పోలీసుల విధులు, ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజల రక్షణలో పోలీసుల సేవలు, పోలీసుల ప్రతిభ, త్యాగాలను ప్రజలకు వివరించనున్నారు.

వ్యాసరచన పోటీలు విద్యార్థులకు(12వ తరగతి వరకు ఉన్న విద్యార్థుల కోసం )

1.సైబర్ నేరాల నివారణలో పోలీసు పౌరుల యొక్క పాత్ర.

2.డ్రగ్స్ నిర్వహణ: నివారణలో పోలీసుల పాత్ర మరియు విద్యార్థులు డ్రగ్స నుండి ఎలా దురంగా ఉండగలరు.

డిగ్రీ మరియు అంతకంటే పై స్థాయి విద్యార్థుల కోసం.

1.సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర

2.తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర

పోలీస్ సిబ్బందికి రెండు కేటగిరీల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు.

కేటగిరీ--1: కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ స్థాయి వరకు

1.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుండి ఎటువంటి సేవలను ఆశిస్తారు?

2.పోలీసు అధికారుల జీవితాల్లో సోషల్ మీడియా పాత్ర మీడియాకు బానిస కాకుండా ఉండటం మరియు వ్యక్తిగత, సామాజిక ప్రయోజనాల కోసం దానిని సద్వినియోగం చేసుకోవడం ఎలా.

కేటగిరీ--2: ఎస్ఐ మరియు పై స్థాయి అధికారులకు

1.పౌరులమన్ననలు పొందటానికి పోలీసులు చేయవలసిన కృషి.

2.క్షేత్రస్థాయి పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడం.

ఈ పోటీలను తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో నిర్వహించనున్నారు. వ్యాసం 500 పదాలకు మించకూడదు. ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురికి అవార్డులు అందజేయడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు.

రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీలు:

పోలీస్ అమరవీరుల స్మరణార్థం రక్తదాన శిబిరాలు,సైకిల్ ర్యాలీలు నిర్వహించనున్నారు. సైకిల్ ర్యాలీల్లో యువత, విద్యార్థులను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేయనున్నారు.

అమరవీరుల కుటుంబాల పరామర్శ:

పోలీస్ అధికారులు అమరవీరుల కుటుంబాల ఇళ్లకు స్వయంగా వెళ్లి వారిని పరామర్శించి, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నారు. అమరవీరుల విగ్రహాలు లేదా ఫొటోలు ఉన్న ప్రాంతాల్లో ఇన్స్పెక్టర్ స్థాయి లేదా అంతకంటే పై స్థాయి అధికారులు గ్రామ పెద్దలు,యువత, విద్యార్థుల సమక్షంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నారు.

షార్ట్ ఫిల్మ్, ఫోటోగ్రఫీ పోటీలు:

పోలీస్ అమరవీరుల త్యాగాలు,పోలీసుల విధులు,ప్రతిభ, ప్రజల రక్షణ వంటి అంశాలపై యువత, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు షార్ట్ ఫిల్మ్,ఫోటోగ్రఫీ పోటీల్లో పాల్గొనాలని కమిషనర్ కోరారు.

పాల్గొనేవారు 3 ఫోటోలు మరియు 3 నిమిషాలకు మించని షార్ట్ ఫిల్మ్ రూపొందించి సమర్పించాలి. ఫోటోలు 10ఐ8 అంగుళాల పరిమాణంలో ఉండాలి. షార్ట్ ఫిల్మ్ను పెన్డ్రైవ్లో పూర్తి వివరాలతో అందజేయాలి. కమిషనరేట్ స్థాయిలో ఎంపికైన మూడు ఉత్తమ షార్ట్ ఫిల్మ్స్,ఫోటోలను రాష్ట్రస్థాయి పోటీల కోసం డీజీపీ కార్యాలయం, హైదరాబాద్కు పంపించనున్నారు.

ఫోటోలు,షార్ట్ ఫిల్మ్లను అక్టోబర్ 23వ తేదీ సాయంత్రంలోగా పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని పోలీస్ పి ఆర్ వో (8712659256) కార్యాలయంలో అందజేయాలి.

అక్టోబర్ 21న స్మృతి పరేడ్:

అక్టోబర్ 21న పోలీస్ హెడ్క్వార్టర్స్లో పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా "స్మృతి పరేడ్", "పోలీస్ ఫ్లాగ్ డే" కార్యక్రమాలను పోలీస్ హెడ్ క్వాటర్స్ పరేడ్ గ్రౌండ్స్ లోని స్మారక స్థూపం వద్ద ఘనంగా నిర్వహించి అమరవీరులకు నివాళులు అర్పించనున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు.

# వైరా మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి.

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణ పనుల్లో జాప్యంపై కలెక్టర్ ఆగ్రహం**

**వైరా రిజర్వాయర్కు వెళ్లే రహదారి,**

**పర్యాటక అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**వైరా పట్టణంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తో కలిసి పర్యటించిన కలెక్టర్**

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 14:**వైరా మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ వైరా మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.





ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంపై కాంట్రాక్టర్పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో జాప్యాన్ని నివారించి, నిర్దేశిత గడువులోగా నిర్మాణాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

అనంతరం రింగ్ రోడ్డు సెంట్రల్ నుంచి వైరా రిజర్వాయర్కు వెళ్లే రహదారిని కలెక్టర్ పరిశీలించారు. రిజర్వాయర్ గుట్టపై పర్యాటక అభివృద్ధికి, రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో పనులకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. పర్యాటక అభివృద్ధికి అనుగుణంగా రహదారి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు.

అసంపూర్తిగా నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్ భవనాన్ని కూడా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మార్కెట్ నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు, ఇతర అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పాలక వర్గం, మున్సిపల్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, డాక్టర్ కాపా మురళీకృష్ణ, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

## రూ.3.94 లక్షల విలువైన చెక్కులు అందజేత




**జహీరాబాద్, అక్టోబర్ 14 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే కొనింటి మాణిక్రావు ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు రూ.3.94 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ ఆయా గ్రామాల సర్పంచులతో కలిసి పంపిణీ చేశారు. ఖాషింపూర్, అల్గోల్, మల్చల్మ, హోతి బి, రాయిపల్లి, సత్వార్ గ్రామాలకు వెళ్లి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేదలు వైద్య ఖర్చుల కోసం అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాంటి వారు స్థానిక ఎమ్మెల్యే కొనింటి మాణిక్రావును సంప్రదించగా, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం మంజూరయ్యేలా కృషి చేశారని పేర్కొన్నారు. మంజూరైన చెక్కులను ఆయా గ్రామాలకు వెళ్లి సర్పంచులతో కలిసి లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దాసరి మచ్చేందర్, చెల్లా శ్రీనివాస్రెడ్డి, ఎక్కెళ్లి రాజు, గోవర్ధన్రెడ్డి, వెంకట్, మాజీ సర్పంచ్ జగదీష్, మాజీ ఎంపీటీసీలు మెయిన్, ఇస్మాయిల్, గ్రామాల పార్టీ అధ్యక్షులు ఆనందం, సయీద్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు వాహీదుద్దీన్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు హీరు రాథోడ్, సర్పంచ్ అభ్యర్థి సాదిక్ సర్వార్, హోతి బి ఉపసర్పంచ్ విష్ణు, అల్గోల్ ఉపసర్పంచ్ బుజ్జమ్మ, నాయకులు ప్రభాకర్, అనిల్, సమద్ సాబ్, రాచన్న, ప్రశాంత్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ కంటి హాస్పిటల్ వైరా వారి అధ్వర్యంలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

## అశ్వాపురంలోఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 14:**అశ్వాపురం మండల కేంద్రంలోని కాలువ బజారు లో ఉన్న సాయిబాబా ఆలయంలో నందు లైన్స్ క్లబ్ ఆఫ్ అశ్వాపురం స్టార్స్ మరియు వైరా లయన్స్ ఐ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు.

వైద్య శిబిరాన్ని అశ్వాపురం గ్రామంలో లైన్స్ ఇంటర్నేషనల్ జోనల్ చైర్మన్ నల్లగట్ల సత్య ప్రకాష్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

ఈ ఉచిత వైద్య శిబిరంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ జి. రవిచంద్ర దాదాపు మంది180 కి కంటి పరీక్షలు నిర్వహించి, 25 మందికి కంటి ఆపరేషన్స్ గుర్తించారు.ఈ సందర్భంగా





లైన్స్ ఇంటర్నేషనల్ జోనల్ చైర్మన్ నల్లగట్ల సత్య ప్రకాష్ మాట్లాడుతూ పేద ప్రజలకు లయన్స్ కంటి ఆసుపత్రి వైరా సహకారంతో అశ్వాపురం పరిసర ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ అశ్వాపురం ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి ఎంతో మందికి చూపును అందించడం జరిగింది అని తెలిపారు.డాక్టర్ కాపా మురళి కృష్ణ ఐ హాస్పిటల్ నిర్వాకులు లయన్ డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు, డాక్టర్ రవిచంద్ర, కంటి ఆసుపత్రి సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ, అటవీ భూముల వివరాలపై తేల్చుకుందాం..

**మీడియా ముందుకు రావాలి.**

**పాయం వెంకటేశ్వర్లుకు**

**రేగా కాంతారావు సవాల్**

భద్రాద్రి కొత్తగూడెం మణుగూరు ఆస్తుల వివరాలు, ప్రభుత్వ భూములు, అటవీ భూములకు సంబంధించిన అంశాలపై రాజకీయంగా చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. పామాయిల్ తోటపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేయిస్తారంటూ పాయం వెంకటేశ్వర్లును ఉద్దేశించి రేగా కాంతారావు ప్రశ్నలు సంధించారు. తుమ్మలచెరువులో కొనుగోలు చేసినట్లు చెబుతున్న 50 ఎకరాల భూమిలో ప్రభుత్వ భూమి ఎంత? అటవీ భూమి ఎంత? అనే అంశాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు.ఇద్దరి ఆస్తుల వివరాలను జిల్లా కలెక్టర్కు సమర్పించి, వారసత్వంగా వచ్చిన ఆస్తులు, స్వయంగా సంపాదించిన ఆస్తుల వివరాలను ప్రజల ముందు ఉంచుదామని రేగా కాంతారావు ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. మొరంపల్లి బంజర, దుమ్ముగూడెం, హైదరాబాద్ ప్రాంతాల్లోని భూముల వివరాలపైనా చర్చిద్దామని సవాల్ చేసినట్లు తెలిపారు.ప్రభుత్వ భూముల వ్యవహారాలపై విచారణ జరగాలిమణుగూరు పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల విక్రయాలు, ఆక్రమణలకు సంబంధించి వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలని రేగా కాంతారావు డిమాండ్ చేసినట్లు సమాచారం. ఆరు ఎకరాల భూమికి పట్టా కోసం ఈ వారంలో దరఖాస్తు చేసిన అంశాన్ని కూడా చర్చలోకి తీసుకురావాలని పేర్కొన్నారు.విజయనగరం ప్రాంతంలో సింగరేణి భూములకు సంబంధించి బినామీ పేర్లతో వ్యవహారాలు జరిగినట్లు చేస్తున్న ఆరోపణలు, గిరిజన ప్రాంతాల్లో 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూముల వివరాలపైనా స్పష్టత రావాల్సి ఉందని ఆయన ప్రశ్నలు లేవనెత్తారు.

## వి ఆర్ 4 సహాయోగ్ చారిటేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత పూజా సామగ్రి సహిత సత్యనారాయణ వ్రతము, అలై - బలై



**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 14 అక్టోబర్ 2026**వి. ఆర్. 4 సహాయోగ్ చారిటేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 24 అక్టోబర్ 2026 శనివారం రోజున తలపెట్టిన శుభకర కార్యక్రమాలకు సంఘీభావం తెలుపుతూ మున్సిపల్ అధికారులు మౌఖిక అంగీకారము తెలిపిన దరిమిలా ట్రస్ట్ సలహాదారుడు దిలీపు కక్కడ్, మేనేజింగ్ ట్రస్టీ అందె లక్ష్మణ్ రావు, ట్రస్ట్ కోశాధికారి హరీ హారనాథు రెడ్డి,



సభ్యురాలు నూకల మంజుల తదితరులు తెలంగాణా మాజీ మంత్రి, ప్రస్తుత మహేశ్వరం శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డిని, రాజేందర్నగర్ బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జీ కార్తీక్ రెడ్డిలను కలసి సాదరముగా ఆహ్వానించడ మైనది. ఇట్టి కార్యక్రమానికి జయ శంకర్ పార్కుకు ముందుగా వచ్చిన భక్తులకు మొదటి ప్రాధాన్యతగా ఉచిత పూజా సామగ్రి సమకూరుస్తూ తలపెట్టిన సామూహిక వినాయక పూజ, అమ్మ వారి కుంకుమార్చన, నవగ్రహ పూజ, అష్టదిక్పాలకుల పూజ, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతము ఇత్యాది పూజలు నిర్వహించడం, తదనంతరము సాయంత్రం విచ్చేసిన ప్రజలందరికి ఆటా పాటలతో కూడిన ధాన్దియ, ఇంద్రజాల గారడిలతో కూడిన స్నేహ పూర్వక ఆలింగన అలై – బలై కార్యక్రమాలకు కుల మతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా స్థానిక నాయకులను, సంఘ పెద్దలను, స్థానిక ప్రజలను పెద్ద సంఖ్యలో ఆహ్వానిస్తామని నిర్వాహకులు తెలియ పరుస్తు, ఇట్టి శుభకర సమయంలో అందరూ పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరడమైనధి.

## ములుగు జిల్లా నుంచి మహిళల 20 ట్రోఫీ జట్టుకు ఎంపికైన కృష్ణవేణి



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 14 ములుగు** జిల్లా నుంచి మహిళా 20 ట్రోఫీకి ఎంపికైన ములుగు జిల్లా క్రీడాకారి సీనియర్ మహిళల టీ–20 ట్రోఫీ హైదరాబాద్ జట్టుకు ఎంపికైన తాటి కృష్ణవేణిని అభినందించిన మంత్రి సీతక్క ప్రజాభవన్‌లో కృష్ణవేణిని శాలువా కప్పి సత్కరించిన మంత్రి సీతక్క తెలంగాణ రాష్ట్రం తరపున జాతీయ స్థాయి క్రికెట్ టోర్నీలో ప్రతిభ చాటిన కృష్ణవేణి మహిళా క్రికెట్ రంగంలో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించిన మంత్రి సీతక్క ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు ఆర్టీవో డైరెక్టర్ శ్రీనివాస్ కాంగ్రెస్ గౌస్ విజయ్ కుమార్ సాయి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు

## గుంతలు పడిన రోడ్డు మరమ్మత్తులు చేయాలని సీతక్కను కోరిన పేరూరు గ్రామస్తులు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 14 వాజేడు** వాజేడు మండల కేంద్రంలోని ధర్మారం పేరూరు రహదారిపై భారీ ఎత్తున గుంతలు పడడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని వాహనదారులు బాటసారులు చాలా ఇబ్బందులు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు ముఖ్యంగా ధర్మారం నుంచి పేరూరు వెళ్లే క్రమంలో రోడ్డు కిరువైపులా భారీ ఎత్తున గుంతలు పడడం ఇసుక లారీలు నడవడంతో రాకపోకలకు చాలా అంతరాయం కలుగుతుందని వారు అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే రోడ్డు మరమ్మత్తులు చేసి ప్రజలకు రహదారి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు

## ఘనంగా జన్మదిన వేడుక



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 15 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** :బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, సౌత్ ఇండియా డిక్కి వైస్ చైర్మన్ చంటి రాహుల్ కిరణ్,జన్మదిన వేడుక ఘనంగా జరిగింది.మునిపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది, మంతూరిశశికుమార్,శాలువాతో సన్మానించిపుష్పగుచ్ఛమిచ్చి, జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు,ఈకార్యక్రమంలో వట్టిపల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రజినీకాంత్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నజీర్,మునిపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి పాండు,పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

### ఈ నెల 15, 16 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు

### ఓటరు నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 14 ఆర్డీవో ఆఫీస్**బుధవారం ములుగు ఆర్డీవో కార్యాలయంలోని తన ఛాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ--2026, వరంగల్--ఖమ్మం--నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటరు నమోదు ప్రక్రియలపై చర్చించారు.

ఈ సందర్భంగా ఓటరు నమోదు అధికారి, ఆర్డీవో మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులు, ముఖ్యంగా 18 నుంచి 19 ఏళ్ల యువత ఓటరు నమోదుకు ముందుకు రావాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 15, 16 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీల బూత్‌స్థాయి ఏజెంట్లు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొనేలా చూడాలని సూచించారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా అనుసంధానం కాని ఓటర్ల వివరాలు, అసంగతతలున్న నమోదులకు సంబంధించి 41,900 నోటీసులు రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 41,764 నోటీసులను అందజేశామని, మిగిలిన నోటీసులను రాబోయే వారం పది రోజుల్లో అందజేయనున్నట్లు పేర్కొన్నారు.ఆగస్టు 17న విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాపై అక్టోబర్ 7 వరకు దరఖాస్తులు, అభ్యంతరాలు స్వీకరించినట్లు వివరించారు. ఫారం--6 ద్వారా 748, ఫారం--7 ద్వారా 13, ఫారం--8 ద్వారా 803 దరఖాస్తులు అందాయని తెలిపారు. వీటిపై విచారణ చేపట్టి, అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించిన అర్హుల దరఖాస్తులను ఆమోదించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు చెప్పారు. అందిన దరఖాస్తులు, అభ్యంతరాల జాబితాలను సమావేశానికి హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు.

పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటరు నమోదుకు సంబంధించి ఫారం--18 ద్వారా అంతర్జాలంలో 4,186 దరఖాస్తులు, నేరుగా 6 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అంతర్జాలంలో అందిన దరఖాస్తుల్లో 47 దరఖాస్తులను ఆమోదించామని, మిగిలిన వాటిని నిర్ణీత సమయంలో విచారించి తుది నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఓటర్ల జాబితా ప్రక్రియపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు.

ఈ సమావేశంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్లు గణపతి, నితీష్, సంబంధిత సిబ్బంది, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరావాదిక సమ్మె రెండవ రోజు




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 14 ఏటూరు నాగారం** మండల కేంద్రంలోని ఏరియా హాస్పిటల్ లో జాతీయ ఆరోగ్య మిషన్ లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తెలంగాణ రాష్ట్ర మంతట 13 నుంచి నిర్వహిస్తున్న నిరావాదిక సమ్మెకు రెండవ రోజు కావడంతో ఉద్యోగులు ప్రభుత్వం నుంచి రావలసిన పెరిగిన జీతాలు అలాగే ఉద్యోగ భద్రత హెల్త్ కార్డులు ఉద్యోగ రెగ్యులరేషన్ కోసం అన్ని శాఖల ఉద్యోగులు ల్యాబ్ టెక్నీషియన్ ఫార్మసిస్ట్ స్టాఫ్ నర్సులు ఏఎన్ఎం సపోర్టింగ్ స్టాఫ్ పేషంట్ కేర్ సెక్యూరిటీ గార్డ్ కాంటినెంట్ వర్కర్స్ అందరు కలిసి 2రోజు ఏటూరునాగారం సామాజిక వైద్యశాలలో సమ్మెలో పాల్గొని నినాదాలు చేస్తూ ప్రభుత్వం వెంటనే 60 జీవోను ఏర్పాటు చేసి పెరిగిన జీతాలు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్ శ్వేత స్రవంతి మానస దివ్య సంధ్య సౌజన్య గంగా భవాని నిర్మల సుకన్య గంగాధర్ రాకేష్ రాజేష్ మురళి భరత్ కృష్ణ యశోద మల్లయ్య సుశీల తదితర ఉద్యోగులు పాల్గొన్నారు

## ష్నైడర్ ఎలక్ట్రిక్‌లో 100 కొలువులు

### డిప్లొమా అభ్యర్థులకు అవకాశం

### ఈ నెల 21 నుంచి ఎంపిక ప్రక్రియ

### జిల్లా ఉపాధి అధికారి రాధిక

**మేడ్చల్--మల్కాజిగిరి ప్రజాబలం ప్రతినిధి, అక్టోబర్ 14:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కార్మిక, ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా నిరుద్యోగ యువతకు ప్రైవేటు సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో 100 ఫిక్స్‌డ్ టర్మ్ అసోసియేట్ ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టినట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం. రాధిక తెలిపారు.

ఈ ఉద్యోగాలకు ఈఈఈ, ఈసీఈ, మెకానికల్ విభాగాల్లో డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు. అభ్యర్థుల వయసు 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి. ఎంపికైన వారికి నెలకు రూ.12,330 వేతనంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తారు. ఉద్యోగ కాలపరిమితి మూడేళ్లు. అభ్యర్థులకు రవాణా సదుపాయం, ఈఎస్ఐ ద్వారా వైద్య సౌకర్యం, గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ (జీపీఏ) బీమా కల్పించనున్నారు.

రాత పరీక్ష, ఇంటర్వ్యూ, ఆప్టిట్యూడ్ పరీక్షలతో పాటు డ్రైవింగ్ పరీక్ష, శారీరక ఆరోగ్య పరీక్షల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, రెజ్యూమేతో జిల్లా ఉపాధి కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

అక్టోబర్ 21 నుంచి 31 వరకు జిల్లా ఉపాధి కార్యాలయంలో మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చని జిల్లా ఉపాధి అధికారి రాధిక తెలిపారు.

## నారింజ వాగులో గుర్తుతెలియని వ్యక్తి మృతి



**జహీరాబాద్, అక్టోబర్ 14 ప్రజాబలం ప్రతినిధి:** నారింజ వాగులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు జహీరాబాద్ రూరల్ ఎస్సై రాజేందర్‌రెడ్డి తెలిపారు. మృతుడి వయసు సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటుందని, తెల్ల వెంట్రుకలు ఉన్నాయని పేర్కొన్నారు. మృతదేహంపై గోధుమ, తెలుపు రంగుల పూల డిజైన్ కలిగిన చొక్కా, నలుపు రంగు ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. మృతుడిని ఎవరైనా గుర్తించినా, అతని కుటుంబ సభ్యులు లేదా బంధువుల వివరాలు తెలిసినా వెంటనే జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓను 8712661847 నంబర్‌లో లేదా పోలీస్ స్టేషన్ 8712656764 నంబర్‌లో సంప్రదించాలని ఎస్సై రాజేందర్‌రెడ్డి కోరారు.

# జనగణన రెండో దశను పకడ్బందీగా నిర్వహించాలి

## వివరాల నమోదులో ఖచ్చితత్వం పాటించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 14.** ములుగుజనగణన విధుల్లో భాగంగా ఛార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులకు అక్టోబర్ 13, 14 తేదీల్లో ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రెండు రోజుల శిక్షణ నిర్వహించారు. బుధవారం నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక శిక్షణను సద్వినియోగం చేసుకొని, జనగణన వివరాల నమోదులో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గతంలో కాగితాలపై నమోదు చేసిన జనగణన వివరాలను ఈసారి ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా సేకరించనున్నందున సంబంధిత సాంకేతిక అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

జనగణన నిర్వహణ, పర్యవేక్షణకు ఉపయోగించే సీఎంఎంఎస్ పోర్టల్‌పై సిబ్బంది పూర్తి అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత వివరాలను సీఎంఎంఎస్ పోర్టల్‌లో తప్పులు లేకుండా ఖచ్చితత్వంతో నమోదు చేయాలని తెలిపారు.

రెండో దశ జనాభా గణనలో అడగనున్న 40 ప్రశ్నలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శిక్షణ సమయంలో సందేహాలను నివృత్తి చేసుకొని, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.

ఈ శిక్షణలో హైదరాబాద్‌లోని జనగణన కార్యకలాపాల సంచాలకుల కార్యాలయం నుంచి విచ్చేసిన సాంకేతిక అధికారి ఏ.ఆర్. యువేందర్ బాబు, జనగణన అధికారి, ప్రధాన శిక్షకుడు సి.హెచ్. నాయుడు ఛార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులకు శిక్షణ అందించారు.

ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పర్యవేక్షకురాలు మంజుల, ములుగు ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయ గణాంక అధికారి భూక్య లాల్ నాయక్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రెస్టారెంట్ బార్లకు భారీ ఎత్తున స్పందన



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 14 ములుగు** ములుగే టాప్.. నర్సంపేట లాస్ట్!ఉమ్మడి జిల్లాలోని ములుగు, నర్సంపేట, కేసముద్రం, స్టేషన్ ఘన్పూర్ రెస్టారెంట్ బార్ల దరఖాస్తుకు టెండర్లకు భారీ స్పందన లభించింది.

అక్టోబర్ 12 నాటికి ములుగులో అత్యధికంగా 362 దరఖాస్తులు వచ్చాయి.

కేసముద్రంలో 324, స్టేషన్ఘన్పూర్ 326, నర్సంపేటలో 114 దరఖాస్తులు అందాయి.

ఈ నాలుగు ప్రాంతాల నుంచి భారీ ఎత్తున రెస్టారెంట్ బార్లకు దరఖాస్తులు రావడంతో ప్రాంతాల్లో కలిపి మొత్తం 1,126 దరఖాస్తులు నమోదయ్యాయి. వీటిలో ములుగు, స్టేషన్ ఘనపూర్ కేసముద్రం ప్రాంతాల్లో దరఖాస్తుల సంఖ్య 300 దాటగా, నర్సంపేటలో 114 దరఖాస్తులకే పరిమితమైంది.

# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఆవుల రాజిరెడ్డి





**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 15 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :**నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి శివ్వంపేట మండలం బిజిలిపూర్, గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారుల ఆనందంలో భాగస్వాములయ్యారు.అనంతరం,మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన నిశ్చితార్థవేడుకకుహాజరై,నూతన,జీవితంలోకిఅడుగుపెడుతున్న వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బి ఆర్ ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకోన్న యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దుడ్డు ఆకాష్



**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 14 అక్టోబర్ 2026**సైబరాబాద్ మున్సిపల్ పరిధిలోని రాజేంద్రనగర్ నియోజకవర్గం, నార్సింగి డివిజన్ కి చెందిన తెలంగాణ కాంగ్రెస్ యూత్ ఉపాధ్యక్షులు దుడ్డు ఆకాష్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి మరియు పదవికి రాజీనామా సమర్పించి మాజీ మంత్రి ప్రస్తుత శాసన సభ్యురాలు పట్లోల్ల సబితా ఇంద్రారెడ్డి మరియు కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ భారత రాష్ట్ర సమితి పార్టీలో చేరడం జరిగినదని అలాగే త్వరలో నార్సింగి మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు మాజీ కౌన్సిలర్లు తన బాటలోనే రెపో మాపో బి ఆర్ ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకో నున్నారని ఆకాష్ తెలిపారు.

# తెలంగాణ జౌళి రంగానికి అంతర్జాతీయ సాంకేతిక సహకారం.. యూకే సంస్థలతో రెండు కీలక ఒప్పందాలు -- మంత్రి తుమ్మల

**- యూకేలోని హడర్స్ ఫీల్డ్ విశ్వవిద్యాలయం, టెక్స్‌టైల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ తో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు**

**- ప్రపంచస్థాయి సాంకేతికతతో తెలంగాణ జౌళి రంగానికి కొత్త దిశ -- మంత్రి తుమ్మల**



తెలంగాణ రాష్ట్రంలో చేనేత, జౌళి రంగాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానిస్తూ, టెక్నికల్ టెక్స్ టైల్స్ రంగాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ప్రముఖ విద్యా, పరిశ్రమ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం రెండుకీలక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

ఈ ఒప్పందాల ద్వారా తెలంగాణలో టెక్నికల్ నియామకం, అధ్యాపకులు, విద్యార్థుల పరస్పర మార్పిడిని ప్రోత్సహించడం వంటివి ఈ ఒప్పందం యొక్క ముఖ్యోద్దేశం అని మంత్రి పేర్కొన్నారు.

అలాగే, టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పురోగతికి అవసరమైన సమగ్ర వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ఈ భాగస్వామ్యం దోహదపడనుందని అన్నారు.

టెక్స్‌టైల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో రెండో ఒప్పందం...

ఒప్పందం ప్రధాన ఉద్దేశం అన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో నైపుణ్యాభివృద్ధి... టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో ప్రపంచస్థాయి నైపుణ్య ప్రమాణాలను తెలంగాణలో అమలు చేసే అవకాశాలను పరిశీలించడంతో పాటు, పరిశ్రమలు, శిక్షణ సంస్థల మధ్య సమన్వయాన్ని పెంపొందించనున్నారు. తద్వారా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ పొందిన నిపుణులను తయారు చేయడం, భారతదేశానికి అంతర్జాతీయంగా పోటీతత్వం కలిగిన టెక్స్‌టైల్ కార్మిక శక్తిని అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు.

తెలంగాణలో టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, అంతర్జాతీయ విద్యా సంస్థలు, పరిశ్రమలతో భాగస్వామ్యాల ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం,



టెక్స్‌టైల్స్ రంగంలో పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించడంతో పాటు, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడం, పరిశ్రమలకు అవసరమైన శిక్షణను అందించడం, ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

హడర్స్‌ఫీల్డ్ విశ్వవిద్యాలయంతో తొలి అవగాహన ఒప్పందం...

యునైటెడ్ కింగ్‌డమ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హడర్స్‌ఫీల్డ్, తెలంగాణ ప్రభుత్వ చేనేత, జౌళి శాఖ మధ్య కుదిరిన తొలి అవగాహన ఒప్పందం ద్వారా రాష్ట్రంలో టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో పరిశోధన, అభివృద్ధికి సహకారం అందించనున్నారు. ఉమ్మడి విద్యా కార్యక్రమాల నిర్వహణకు అవకాశాలను అన్వేషించడం, విజిటింగ్ అకడమిక్ సిబ్బంది యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన టెక్స్‌టైల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఏజశీజు)తో తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ పరిధిలోని చేనేత, జౌళి, హస్తకళల విభాగం రెండో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. 2026 అక్టోబర్ 14న కుదిరిన ఈ ఒప్పందం ద్వారా టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో వృత్తి విద్య, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయనున్నారని మంత్రి తెలిపారు.

ప్రత్యేకంగా 3ణ వీవింగ్, కాంపోజిట్ మెటీరియల్స్ వంటి ఆధునిక సాంకేతిక వస్త్రాల తయారీ, పరిశోధన, శిక్షణపై దృష్టి సారించనున్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను గుర్తించి, వాటికి అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలను రూపొందించడం, అంతర్జాతీయ నైపుణ్య ప్రమాణాలకు అనుగుణంగా మానవ వనరులను తీర్చిదిద్దడం ఈ

పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి కొత్త మార్గాలు ఏర్పడతాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

ఈ భాగస్వామ్యాలను సమర్థంగా వినియోగించుకుని రాష్ట్రంలో టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

ఈ సమావేశంలో భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, జౌళిశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సభ్యసాచి ఘోష్, యార్క్ షైర్ మేయర్ యొక్క బిజినెస్ అడ్వైసర్ Mandy Ridyard, Antich & Sons (Huddersfield) Ltd ఎండి David Antich, టెక్నికల్ టెక్స్ టైల్స్ ప్రొఫెసర్ గోస్వామి, టెక్స్ టైల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఎండి అజీజ్ మరియు జౌళిశాఖ అధికారులు పాల్గొన్నారు.

# బాబానగర్ రంజోల్‌లో రూ.48 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**జహీరాబాద్, అక్టోబరు 14 ప్రజా బలం ప్రతినిధి:** పట్టణ అభివృద్ధిలో భాగంగా జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డు బాబానగర్ రంజోల్‌లో రూ.48 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్‌తో కలిసి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మెరుగైన రహదారులను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వార్డుల వారీగా ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. బాబానగర్ రంజోల్‌లో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మహేష్, కౌన్సిలర్ జనబాయి, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నేడు ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నేడు బతుకమ్మ ఉత్సవాలు అత్యంత ఘనంగా జరిగాయి. సచివాలయ మహిళా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బతుకమ్మ ఉత్సవాలకు రాష్ట్ర పంచాయతీరాజ్ శ్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సచివాలయ మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు రమాదేవి నేతృత్వంలో జరిగిన ఈ బతుకమ్మ ఉత్సవాలకు హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ, దేశంలో మరెక్కడా లేని విధంగా పూలను పూజించే గొప్ప సాంప్రదాయం మన తెలంగాణలో ఉందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో అత్యంత కీలక పాత్ర వహించే సచివాలయ ఉద్యోగులు ఈ బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం పట్ల అభినందనలు తెలిపారు అనంతరం సచివాలయ మహిళా ఉద్యోగులు అధికారులు తమ కుటుంబ సభ్యులతో బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు.



# తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు ఐక్యతకు ప్రతీక బతుకమ్మ .

## మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ వైరా మున్సిపాలిటీ ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు

ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 14:తెలంగాణసంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ సంబరాలు మునిసిపల్





ప్రాంగణంలో అంబరాన్నంటాయి. బతుకమ్మ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ బతుకమ్మ ఆడారు.ఈ సందర్భంగాఆమె బతుకమ్మ కేవలం పండగ మాత్రమే కాదని తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రకృతి ఆరాధించే గొప్ప సాంస్కృతిక ప్రతీక అని పేర్కొన్నారు. మున్సిపల్ ప్రాంగణంలో బంతి చామంతి గునుగు తంగేడు తదితరు పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి వాటి చుట్టూ మహిళలు మున్సిపల్ సిబ్బంది చేరి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలంటూ సంప్రదాయ గీతాలు ఆలపించారు అనంతరం ఆరో వార్డులో ఏర్పాటుచేసిన బతుకమ్మ వేడుకల్లో చంద్రకళ పాల్గొన్నారు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను ఆమె వివరించారు. మహిళలందరూ సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఆమె బతుకమ్మ వేడుకలో లయబద్ధంగా అడుగులు వేస్తూ కోలాటంతో ఉత్సాహపరిచారు బతుకమ్మ వేడుకల్లో డ్రాలో బహుమతులు గెలుచుకున్న వారికి బహుమతులను అందజేశారు ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా మెడికల్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ,వైరా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పారుపల్లి కృష్ణారావు, తోటకూర శ్రీకాంత్, లగడపాటి ప్రభాకర్ రావు,డాక్టర్ తుమ్మ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపాలిటీలో 13వ వార్డ్ కౌన్సిలర్ ముళ్ళపాటి విజయలక్ష్మి సీతారాములు , మేనేజర్ సుధీర్,మెప్మా టీఎంసీ బండారుపల్లి వెంకటేశ్వర్లు , మెప్మా ఆర్ పి లు వైరా లయన్స్ క్లబ్ అవని అధ్యక్షురాలు గద్దె నీరజ,మున్సిపల్ సిబ్బంది పాల్గొని బతుకమ్మ పాటలుపాడి ఆటలాడారు.

# జర్నలిస్టులపై దాడులు.. ప్రజాస్వామ్య గొంతుకపై దండయాత్ర!

## ప్రశ్నిస్తే దాడులా? వార్త సేకరిస్తే వేధింపులా?
## మహిళా జర్నలిస్టులకూ రక్షణ కరువా? కేంద్ర జర్నలిస్టుల రక్షణ చట్టం కోసం దేశవ్యాప్తంగా డిమాండ్!
## ఢిల్లీ నుంచి ఉత్తరప్రదేశ్, ఇండోర్ వరకు దాడుల ఆరోపణలు..
## జర్నలిస్టుల భద్రతపై ఆందోళన

న్యూఢిల్లీ/భోపాల్, అక్టోబర్ 14 ప్రశ్నించడం జర్నలిస్టు బాధ్యత.. ప్రజలకు వాస్తవాలను తెలియజేయడం పాత్రికేయ వృత్తి ధర్మం.. అధికారంలో ఉన్నవారిని నిలదీయడం ప్రజాస్వామ్యంలో మీడియాకు ఉన్న కీలకమైన హక్కు! కానీ, నేడు ప్రశ్నించినందుకు దాడులు ఎదుర్కోవాల్సి వస్తే.. వార్త సేకరించినందుకు బెదిరింపులు ఎదుర్కోవాల్సి వస్తే.. ప్రజాస్వామ్యంలో భావప్రకటన స్వేచ్ఛకు భరోసా ఎక్కడ? ప్రజల పక్షాన నిలబడే జర్నలిస్టులకు రక్షణ ఎవరు కల్పిస్తారు? అనే ప్రశ్నలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నాయి.

జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, విధులకు ఆటంకాలు కలిగిస్తున్నారనే ఆరోపణలు మీడియా వర్గాల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నాయి. తాజాగా ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఇండోర్ ప్రాంతాల్లో జర్నలిస్టులపై దాడులకు సంబంధించిన ఘటనలు వెలుగులోకి వచ్చినట్లు అందిన వివరాలు ఈ ఆందోళనలను మరింత పెంచుతున్నాయి. ముఖ్యంగా మహిళా జర్నలిస్టులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న భద్రతాపరమైన సవాళ్లు ఆందోళన కలిగిస్తున్నాయి.

**ప్రశ్న అడిగితే దాడి చేయడం ఏ ప్రజాస్వామ్యానికి నిదర్శనం?**

**ఢిల్లీలో మహిళా జర్నలిస్టుపై దాడి ఆరోపణలు!**

ఢిల్లీలో 4టీవీ న్యూస్ నెట్‌వర్క్‌కు చెందిన మహిళా జర్నలిస్టు షహీన్ ఖాన్ అధికార పార్టీకి చెందిన సీనియర్ నాయకులను ప్రశ్నిస్తూ ప్రత్యక్ష ప్రసారం నిర్వహిస్తున్న సమయంలో దాడికి గురైనట్లు కథనంలో పేర్కొన్నారు. గుర్తుతెలియని వ్యక్తి సైకిల్ చైన్‌తో దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడినట్లు ఆరోపణలు వచ్చాయి. దాడితోపాటు అనుచిత వ్యాఖ్యలు కూడా చేసినట్లు సమాచారం.

ఈ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (NHRC) ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు నోటీసు జారీ చేసి నివేదిక కోరినట్లు అందిన వివరాలు వెల్లడిస్తున్నాయి. ఈ వ్యవహారంలో దాడికి పాల్పడిన వ్యక్తిని గుర్తించడం, ఘటన వెనుక కారణాలను వెలికితీయడం, బాధితురాలికి న్యాయం జరిగేలా చూడటం కీలకమని మీడియా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఒక మహిళా జర్నలిస్టు విధులు నిర్వహిస్తున్న సమయంలోనే భద్రతకు ముప్పు ఏర్పడితే, సాధారణ పరిస్థితుల్లో ఆమెకు రక్షణ ఎలా ఉంటుందనే ప్రశ్న తలెత్తుతోంది. వార్తా సేకరణ సమయంలో జర్నలిస్టులకు తగిన భద్రత కల్పించడం సంబంధిత అధికారుల బాధ్యత కాదా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**ఉత్తరప్రదేశ్‌లో దివ్య శ్రీవాస్తవపై దాడి!**

ఉత్తరప్రదేశ్‌లో స్వతంత్ర జర్నలిస్టు దివ్య శ్రీవాస్తవపై బీజేపీ కార్యాలయం వెలుపల దాడి జరిగినట్లు అందిన సమాచారం మరోసారి చర్చకు దారితీసింది. ప్రభావవంతమైన వ్యక్తులను ప్రశ్నించిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు కథనంలో పేర్కొన్నారు. అయితే, దాడికి గల అసలు కారణాలు, నిందితుల వివరాలు, పోలీసుల చర్యలపై అధికారిక సమాచారం ధృవీకరించాల్సి ఉంది. జర్నలిస్టు ఏ పార్టీకి అనుకూలంగా ఉన్నారు? ఏ పార్టీని విమర్శిస్తున్నారు? అన్నది పక్కనపెడితే, విధి నిర్వహణలో ఉన్న వ్యక్తిపై దాడి జరిగిందనే ఆరోపణలు వచ్చినప్పుడు నిష్పక్షపాతంగా విచారణ జరగాలి. తప్పు చేసినవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. రాజకీయ భేదాభిప్రాయాలు భౌతిక దాడులకు కారణం కాకూడదు.

ప్రశ్నించే గొంతును బలప్రయోగంతో అణచివేయాలనే ధోరణి ఎక్కడ కనిపించినా అది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమే. విమర్శలను ఎదుర్కొనే సహనం, ప్రశ్నలకు సమాధానాలు చెప్పే బాధ్యత ప్రజాస్వామ్య వ్యవస్థలో అంతర్భాగాలు కావాలి.

**ఇండోర్ ఆర్‌టీఓలో న్యూస్ 24 బృందంపై దాడి!**

ఇండోర్‌లోని ఆర్‌టీఓ కార్యాలయం వద్ద న్యూస్ 24 బృందంపై దాడి జరిగినట్లు మరో వార్తా కథనం పేర్కొంది. ఈ ఘటనలో జర్నలిస్టు గాయపడినట్లు, మెడకు కాలర్ ధరించి ఆసుపత్రి పడకపై చికిత్స పొందుతున్న దృశ్యం ప్రచారంలో ఉన్నట్లు అందిన సమాచారం సూచిస్తోంది. అయితే, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, గాయపడిన వ్యక్తి పరిస్థితి, దాడికి కారణాలు స్వతంత్రంగా ధృవీకరించాల్సి ఉంది.

వరుసగా ఇలాంటి ఘటనలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో జర్నలిస్టుల భద్రతపై సమగ్ర చర్చ జరగాల్సిన అవసరం ఏర్పడింది. వార్తా సేకరణకు వెళ్లిన బృందాలు దాడులకు గురవుతుంటే, ప్రజలకు వాస్తవాలను చేరవేసే వ్యవస్థ స్వేచ్ఛగా పనిచేయగలదా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ పార్టీల కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలు.. ఎక్కడైనా జర్నలిస్టులు తమ విధులను చట్టబద్ధంగా నిర్వహించగలిగే వాతావరణం ఉండాలి. అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలి. దాడులు, బెదిరింపులు ఏ సమస్యకూ పరిష్కారం కావు.

**కేంద్ర జర్నలిస్టుల రక్షణ చట్టం ఎప్పుడు?**

జర్నలిస్టులపై దాడులు జరిగిన ప్రతిసారీ ఖండనలు వ్యక్తమవుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో వారికి ఎంతవరకు భద్రత లభిస్తోందనే ప్రశ్న మాత్రం మిగిలిపోతోంది. ఈ నేపథ్యంలో జర్నలిస్టులకు రక్షణ కల్పించే సమగ్ర చట్టం తీసుకురావాలనే డిమాండ్ బలపడుతోంది.



Masood Javed Quadri
National Secretary



Mohammad Parvez
National Vice President



Seraj Ahmad Qureshi
National President

విధి నిర్వహణలో జర్నలిస్టులపై దాడులు జరిగితే తక్షణమే కేసులు నమోదు చేయడం, నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టడం, బాధితులకు న్యాయసహాయం అందించడం, బెదిరింపులకు గురవుతున్న వారికి అవసరమైన భద్రత కల్పించడం వంటి అంశాలకు చట్టపరమైన భరోసా ఉండాలని పాత్రికేయ వర్గాలు కోరుతున్నాయి.

అయితే, జర్నలిస్టుల రక్షణ పేరుతో చట్టం రూపొందించినప్పుడు పత్రికా స్వేచ్ఛ, బాధ్యతాయుతమైన జర్నలిజం, చట్టం ముందు అందరి సమానత్వం వంటి అంశాలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలి. చట్టం దుర్వినియోగం కాకుండా తగిన రక్షణలు కూడా ఉండాలి.

**మసూద్ జావేద్ డిమాండ్.. జర్నలిస్టులకు భరోసా కల్పించాలి!**

జాతీయ కార్యదర్శి మసూద్ జావేద్ ఈ ఘటనలపై స్పందిస్తూ, జర్నలిస్టులపై దాడులు కొనసాగకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టుల రక్షణకు సమగ్ర చట్టపరమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసినట్లు అందిన వివరాలు పేర్కొంటున్నాయి.

జర్నలిస్టులపై దాడులు వ్యక్తులపై జరిగే దాడులుగానే కాకుండా, ప్రజలకు సమాచారం అందించే వ్యవస్థపై ప్రభావం చూపే పరిణామాలుగా చూడాల్సిన అవసరం ఉందని మీడియా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. జర్నలిస్టులు భయాందోళనలు లేకుండా పనిచేయగలిగినప్పుడే ప్రజా సమస్యలు వెలుగులోకి వస్తాయి. అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగంపై ప్రశ్నలు సమాజం ముందుకు వస్తాయి.

ఈ నేపథ్యంలో జాతీయ అధ్యక్షుడు సెరాజ్ అహ్మద్ ఖురేషి, జాతీయ ఉపాధ్యక్షుడు మహ్మద్ పర్వేజ్, జాతీయ కార్యదర్శి మసూద్ జావేద్ పేర్లు ఈ పత్రికా క్లిప్పింగ్‌లో ప్రస్తావించబడ్డాయి. సంస్థ తరఫున వెలువడిన పూర్తి అధికారిక ప్రకటన అందుబాటులో ఉంటే, వారి అభిప్రాయాలను మరింత స్పష్టంగా ప్రచురించవచ్చు.

**జర్నలిస్టుల భద్రతే ప్రజాస్వామ్యానికి రక్షణ కవచం!**

ప్రజాస్వామ్యంలో ప్రశ్నలు అడగడం నేరం కాదు. అధికారులను నిలదీయడం తప్పు కాదు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం జర్నలిస్టుల వృత్తిపరమైన బాధ్యత. అయితే, ఈ బాధ్యతను నిర్వర్తించే క్రమంలో వారు దాడులు, బెదిరింపులు ఎదుర్కోవాల్సి వస్తే, అది ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆందోళనకరమైన సంకేతం.

జర్నలిస్టులకు రక్షణ కల్పించడం అంటే ఒక వృత్తి వర్గానికి మాత్రమే మేలు చేయడం కాదు. ప్రజలకు వాస్తవాలు తెలుసుకునే హక్కును కాపాడటమే. బాధిత జర్నలిస్టులకు న్యాయం జరగాలి. ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరగాలి. దోషులుగా తేలినవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి. ప్రశ్నించే గొంతును భయపెట్టడం సులభమే కావచ్చు.. కానీ ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును కాపాడటం ప్రభుత్వాలు, చట్టవ్యవస్థలు, సమాజం ఉమ్మడి బాధ్యత. జర్నలిస్టుల భద్రతపై మాటలు కాదు.. ఆచరణలో భరోసా కావాలి.

## ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత నివ్వడం అభినందనీయం - మంత్రి శ్రీధర్ బాబు

ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తూ నూతన యాప్ ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. నగరానికి చెందిన స్టార్టప్ కంపెనీ ఎస్ కే రైడో ప్రత్యేక భద్రతా ప్రమాణాలతో రూపొందించిన హైలో యాప్ ను సంస్థ నిర్వాహకులు శ్రీకాంత్ మహర్షి లతో కలిసి ప్రారంభించారు. అంతర్జాతీయ స్థాయిలో సేవలందిస్తున్న సంస్థల తో పోటీపడే విధంగా యాప్ ను రూపొందించడం గర్వకారణం అని అన్నారు. స్థానిక స్టార్టప్ కంపెనీలకు ప్రభుత్వం, ప్రజల నుంచి ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఇతర యాప్ ల లో లేని ప్రత్యేక ఫీచర్స్ ను తమ యాప్ లో చేర్చినట్లు నిర్వాహకులు తెలిపారు. రాపిడ్ ఎస్ ఓ ఎస్, సైలెంట్ అలర్ట్ లతో పాటు అనుకోని సందర్భాలలో ప్రయాణిస్తున్న వాహనం చెడిపోతే ప్రత్యేక వాహనంలో ప్రయాణికులను గమ్యస్థానానికి చేర్చే సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు.

## రూ కోటితో కొనుగోలు చేసిన జేసీబీ, లాడర్ యంత్రాలను ప్రారంభించిన మేయర్

కరీంనగర్ నగరపాలక సంస్థ నిధులు రూ. కోటితో కొనుగోలు చేసిన నూతన జేసీబీ, లాడర్ యంత్రాలను బుధవారం కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర విస్తరణకు అనుగుణంగా పారిశుధ్య పనులను వేగవంతం చేసేందుకు యంత్రాలను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. త్వరలో మరో రెండు వైకుంఠ రథాలను కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా స్వచ్ఛ భారత్ మిషన్ కింద రూ.17 కోట్లతో బయోమైనింగ్ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా రూ.80 కోట్లతో డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కరీంనగర్‌ను మోడల్ సిటీగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం, అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com